సోమవారం
10-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 287
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

యుద్ధం ఆపండి... జర్మన్ల డిమాండ్

రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపాలని, శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ జర్మనీ ప్రజలు రోడ్లపైకొచ్చారు. ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇవ్వవద్దని కోరారు. ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

2లో

దళితులపై దాడులకు నిరసనగా

రేపు చలో విజయవాడ

జయప్రదానికి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులు, అకృత్యాలను నిరసిస్తూ ఈ నెల 11వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దళితులు, మైనార్టీలపై దాడులు, అకృత్యాలు నానాటికీ పెరిగిపోతున్నాయని తెలిపారు. కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తున్న తరుణంలో మాస్కులు లేవన్న పాపానికి డాక్టర్ సుధాకర్‌ను వైసీపీ ప్రభుత్వం మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేసిందన్నారు. నడిరోడ్డుపై డాక్టర్ సుధాకర్ పెడరెక్కలు విరిచికట్టి అవమానపరచిన ఘటన అమానుషమని, ప్రభుత్వ వేధింపులు తాళలేక డాక్టర్ సుధాకర్ మరణించారని పేర్కొన్నారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని అమానుషంగా హత్యచేసి, డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ బెయిల్‌పై విడుదలవ్వగా ఘనంగా స్వాగత సత్కారాలు ఏర్పాటు చేయడం ఆ పార్టీకి సిగ్గుచేటన్నారు. ఇటీవల కడప జిల్లా పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ దళిత డాక్టర్ అచ్చన్నను కిడ్నాప్‌చేసి హత్యచేసిన ఘటన దుర్మార్గమన్నారు. మైనారిటీలపై, మహిళలపై దాడులు, అకృత్యాలు జరుగుతున్నా సీఎం జగన్‌కు చీమ కుట్టినట్టయినా లేదని, కర్నూలు జిల్లా ఎర్రబాడు గ్రామంలో హాజీర అనే 22 ఏళ్ల యువతిని అత్యంత కిరాతకంగా అత్యాచారయత్నం చేసి,

- మిగతా 2 లో

మితవాద రాజకీయాలపై పోరుకు

వామపక్ష ఐక్యత అవశ్యం

- బీజేపీపై సైద్ధాంతికంగా పోరాడేది కమ్యూనిస్టులే
- వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించడం అవసరం
- హైదరాబాద్ సభలో రాజా, ఏచూరి

విశాలాంధ్ర-హైదరాబాద్: మితవాద రాజకీయాలపై పోరాడాలంటే వామపక్ష ఐక్యత అత్యంత అవసరమని, ఇందుకు తెలంగాణ రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం ఉమ్మడి సమావేశం ఒక ముందడుగు అని సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి. రాజా, సీతారాం ఏచూరి పేర్కొన్నారు. మోదీని గద్దె దించితేనే దేశానికి రక్షణ ఏర్పడుతుందని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీకి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేసేది కమ్యూనిస్టులు మాత్రమేనని స్పష్టం చేశారు. దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తీసుకు వచ్చేందుకు ఆర్‌ఎస్ ఎస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించకపోతే దేశాన్ని, రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేమని చెప్పారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించే బాధ్యత వామపక్షాలతో పాటు లౌకిక, ప్రగతిశీల శక్తులు, పార్టీలపై కూడా ఉన్నదన్నారు. హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సీపీఐ, సీపీఎం మండల, జిల్లా, నియోజకవర్గ, రాష్ట్ర స్థాయి నాయకుల సంయుక్త సమావేశం ఆదివారం జరిగింది. పదివేల మందికిపైగా ఉభయ పార్టీల వివిధ స్థాయి నాయకత్వం ఇందులో పాల్గొన్నది. సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పరస్పర విశ్వాసం ద్వారా ఐక్యత: రాజా

అన్ని రంగాలలో సంక్షోభం సృష్టిస్తున్న, రాజ్యాంగాన్ని, సమాఖ్యస్ఫూర్తిని, లౌకికవాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న బీజేపీని ఐక్యత ద్వారానే ఓడించగలమని, ఈ వాస్తవాన్ని లౌకిక, ప్రాంతీయ, మధ్యేవాద పార్టీలు గుర్తించాలని డి.రాజా విజ్ఞప్తి చేశారు. గతంలో ఒకే దేశం, ఒకే ఎన్నికలు, ఒకే సంస్కృతి, ఒకే భాష అనే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రాను రాను ఒకే దేశం ఒకే పార్టీ, ఒకే నాయకుడు, అది మోదీ అనే స్థాయికి చేరుకున్నాయన్నారు. ఆర్‌ఎస్ ఎస్ సిద్ధాంతం ఫాసిస్టు సిద్ధాంతమని, వారి లక్ష్యం విభజనవాదం, హిందూ రాష్ట్రం, ఏక సంస్కృతి, మధ్య యుగాల విధానాల పునరుద్ధరణ అని పేర్కొన్నారు. భారత దేశం హిందూ రాష్ట్రంగా మారితే అది అత్యంత తీవ్ర విపత్తుగా మారుతుందని రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చెప్పారని, కాని బీజేపీ, ఆర్‌ఎస్ ఎస్ ఆ ప్రయత్నాలే చేస్తున్నాయని విమర్శించారు. భారతదేశం రాష్ట్రాల కూటమి అని, అయినప్పటికీ గవర్నర్‌ను ఆయుధంగా మార్చుకొని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరుస్తున్నాయన్నారు. కమ్యూనిజం ప్రమాదకరమైన సిద్ధాంతమని, అది దావానలంలా దహించి వేస్తుందని ప్రధాని మోదీ అన్నారని, అది వాస్తవమేనని మోదీ, బీజేపీలకు కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రమాదకరమైనదేనని రాజా అన్నారు. సంపద సృష్టికర్తలైన రైతులు, కార్మికులు, ఇతర వర్గాల ప్రజలకు కమ్యూనిస్టు సిద్ధాంతం ప్రియమైనదన్నారు. కమ్యూనిస్టు పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్ ఒకేసారి పుట్టాయని, కాని దేశ స్వాతంత్ర్యంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర లేదని, కమ్యూనిస్టు నాయకులు వలసవాదానికి, బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం అపూర్వ పోరాటంలో ఎన్నో త్యాగాలు చేశారని రాజా చెప్పారు. బీజేపీని ఓడించేందుకు చరిత్ర మరోసారి కమ్యూనిస్టులకు కర్తవ్యాన్ని అందిస్తోందని, 2024లో ఎట్టి పరిస్థితుల్లో బీజేపీని ఓడిస్తామన్నారు. కమ్యూనిస్టుల ఐక్యత

- మిగతా 2 లో

ఇంటర్ వెయిటేజీతో

ఈఏపీసెట్‌కు గిరాకీ

- ఐఐటీ, నిట్‌లో సీటు రాకుంటే వెనక్కి
- ప్రైవేట్ వర్సిటీ ఇంజనీరింగ్ సీట్లపై దృష్టి
- మే 15 నుంచి ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్‌కు మళ్లీ గిరాకీ పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2023 ర్యాంకింగ్‌లో రెండు సంవత్సరాల (ప్రథమ, ద్వితీయ) ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీని నిర్ణయించింది. దీంతో ఇంటర్ ద్వితీయ విద్యార్థులంతా పరీక్షలలో వారి మార్కుల సాధన కోసం తీవ్రంగా కృషి చేశారు. ఆ తర్వాత ఈఏపీసెట్‌లో మార్కుల సాధన కోసం ప్రయత్నిస్తున్నారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌లో ర్యాంకులు సాధించి ఐఐటీ, నిట్‌లలో సీట్లు రాని వారంతా డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఇంజనీరింగ్ సీట్లపైనే కన్నేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా ఆయా విశ్వవిద్యాలయాల ప్రవేశ పరీక్షలను రాస్తున్నారు. కరోనా కారణంగా రెండు విద్యా సంవత్సరాలపాటు ఏపీ ఈఏపీసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ తొలగించారు. పూర్తి స్థాయి సిలబస్‌తో పరీక్షలు సజావుగా జరగకపోవడం, దానికితోడు విద్యార్థులు పూర్తిగా సిలబస్‌పై దృష్టి కేంద్రీకరించనందున మార్కులను మినహాయించారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో చేరే కన్వీనర్ కోటా విద్యార్థులందరికీ ఈఏపీసెట్-2023 తప్పనసరిగా అర్హత సాధించాలి. ఈఏపీసెట్ మార్కులకు 75 శాతం, ఇంటర్ మార్కులకు 25 శాతంతో అభ్యర్థులకు ర్యాంకులు కేటాయిస్తారు.

ఐఐటీ, నిట్ రాకుంటే... ఈఏపీసెట్ వైపే

జేఈఈ(మెయిన్స్), అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించి, ఆ తర్వాత ఐఐటీ, నిట్‌లలో సీట్లు సాధించలేక పోయిన వారంతా ఏపీ ఈఏపీసెట్‌పైనే దృష్టి పెడుతున్నారు. సీఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీలోని నాలుగు పేరొందిన

- మిగతా 2 లో

రైల్వేలో 3.15 లక్షలకు పైగా ఖాళీలు

ఇందులో నాన్ గెజిటెడ్ పోస్టులే ఎక్కువ

న్యూఢిల్లీ: భారతీయ రైల్వేలో 3.15లక్షలకుపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 31 నాటికి 18 జోన్లలోని గెజిటెడ్, నాన్ గెజిటెడ్ విభాగాల్లో ఈ మేరకు ఖాళీలు ఉన్నట్లు ప్రభుత్వ డేటా చెబుతోంది. ఫిబ్రవరి ఒకటో తేదీ నాటి రైల్వే శాఖ డేటా ప్రకారం గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఖాళీలు 21,837 మేర పెరిగినట్లు తెలుస్తోంది. దీంతో మొత్తం ఖాళీల సంఖ్య 3,15,780కు చేరింది. నాన్ గెజిటెడ్ పోస్టుల్లో ఇంజినీర్లు, టెక్నీషియన్లు, క్లర్కులు, స్టేషన్ మాస్టర్లు, టికెట్ కలెక్టర్ల పోస్టులు ఉన్నాయి. 2,885 గెజిటెడ్ పోస్టులు ఖాళీగా ఉంటే నాన్ గెజిటెడ్ పోస్టులు 3,12,989 ఖాళీగా ఉన్నట్లు 18 జోన్ల డేటా ప్రకారం తెలుస్తోంది. అలాగే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విభాగాల్లో కనీసం 18,670 ఖాళీలు ఉన్నాయి. ఈఏడాది జనవరిలో ఎస్సీ విభాగంలో 6,112 ఖాళీలు ఉంటే ఎస్టీలకు సంబంధించి 5,113, ఓబీసీల విభాగంలో 7,427 పోస్టులు ఖాళీగా

- మిగతా 2 లో

కల్లాల్లో ఉన్న పసుపు

పసుపు...

గిట్టుబాటు ధర కరువు

- దిగుబడులు లేక రైతుల దిగాలు
- కనీసం పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి
- కనీస మద్దతు ధర కల్పించని ప్రభుత్వం

విశాలాంధ్ర-భట్టిప్రోలు/బాపట్ల: పుడమి తల్లిని నమ్ముకుని వ్యవసాయమే జీవనాధారంగా పంటలను పండిస్తున్న రైతన్నకు పాలక ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలం చెందుతున్నాయి. ఫలితంగా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. రాష్ట్రంలో పసుపు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వారికి పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలోని కృష్ణానది తీరం వాణిజ్య పంటలకు నిలయం. తీర లంక గ్రామాలైన చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు, కన్నెగంటివారిపాలెం, పెదపులివర్రు, అక్కివారిపాలెం, గొరిగపూడి, వెల్లటూరు తదితర గ్రామాలలో ప్రధానంగా పసుపు, కంద, అరటి, మొక్కజొన్న, తమలపాకు, బొప్పాయి పంటలను సాగు చేస్తుంటారు. సదరు గ్రామాలలో 2017లో ఖరీఫ్ సీజన్ పురస్కరించుకొని సుమారు రెండు వేల ఎకరాలలో పసుపు పంట సాగు చేశారు. అయితే ప్రస్తుతం వస్తున్న దిగుబడులను చూసి రైతు కన్నీరు పెడుతున్నాడు. దుంప ఊట సమయంలో దుంప కుళ్లు తెగులు సోకడంతో దిగుబడులు గణనీయంగా పడిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడులు రావల్సి ఉండగా 20 నుంచి 25 క్వింటాళ్లు మాత్రమే వస్తుండడంతో వేలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. క్వింటా పసుపు కొమ్ముల ధర రూ.5 వేల నుంచి రూ.5,500 కు మించి పలకడం లేదంటున్నారు. ఇటు పసుపు పంటకు గిట్టుబాటు ధర లేక అటు దిగుబడులు లేక పెట్టుబడులు సైతం నష్టపోయామని లంక గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.50 వేలు నష్టం

పసుపు పంట సాగుకు ఎకరం భూమికి రూ.50 వేలు కౌలు చెల్లించి మరో 1.20 లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి రైతులు సాగు చేశారు. ఎకరాకు ప్రస్తుతం వస్తున్న దిగుబడులకు మార్కెట్‌లో క్వింటా కొమ్ముల ధర రూ.5 వేల నుంచి రూ.5,500 పలుకుతోంది. దీంతో కనీసం పెట్టుబడి కూడా చేతికి రాకపోవడమే కాకుండా ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు నష్ట పోవల్సివచ్చిందని రైతులు వాపోతున్నారు. విత్తనం నాటే సమయంలో అధిక ధర పలికిన పసుపు ధర నేడు రూ.5,500 కు పడిపోయింది.

కనీస మద్దతు ధరను రూ.8 వేలుగా నిర్ణయించాలి

వంట పసుపు కొమ్ములకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను రూ.8 వేలుగా నిర్ణయించి తమను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, కమిటీల నివేదికల ఆధారంగా వారి సంక్షేమానికి కృషి చేస్తామంటూ పాలకులు ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోవడం లేదు. గడచిన 20 సంవత్సరాలలో వ్యవసాయ రంగంపై 30కి పైగా కమిటీలను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సీఆర్ స్ఫూర్తితో ప్రజాపోరాటాలు

- సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా పిలుపు
- వాడవాడలా 29వ వర్ధంతి

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: భూపోరాటయోధ, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి చండ్ర రాజేశ్వరరావు జీవితం స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చండ్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి సందర్భంగా ఆదివారం దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుశ్రేణులు సీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. దేశీయంగా, అంతర్జాతీయంగా కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో చండ్ర రాజేశ్వరరావు విగ్రహానికి ఫౌండేషన్ చీఫ్ ప్యాట్రన్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ, సీపీఐ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, కూనంనేని సాంబశివరావు, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కార్యదర్శి పీజే చంద్రశేఖరరావు,

- మిగతా 2 లో

పెరగనున్న అమెరికా వీసా రుసుము

మే 30 నుంచి అమల్లోకి

వాషింగ్టన్: విద్యార్థులు, పర్యాటకులతో పాటు అనేక విభాగాలకు సంబంధించిన వీసాల కోసం రుసుమును భారీగా పెంచేస్తూ అమెరికా ప్రకటన చేసింది. మే 30వ తేదీ నుంచి ఈ పెంపుదల అమల్లోకి వస్తుందని తెలిపింది. ప్రాసెసింగ్ ఫీజు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా చెబుతోంది. వీసాల రుసుము బిజినెస్/టూరిజం కోసం ఇచ్చే విజిటర్ వీసా (బీ1/బీ2), స్టూడెంట్, ఎక్స్ఛేంజ్ విజిటర్ వీసాల ఫీజును 160 డాలర్ల నుంచి 185డాలర్లకు పెంచింది. తాత్కాలిక వర్కింగ్ వీసాలైన హెచ్, ఎల్, ఓ, పీ, క్యూ, ఆర్ విభాగాలకు సంబంధించి ఫీజు 190 డాలర్ల నుంచి 205 డాలర్లకు చేరింది. ట్రీటీ 'ఈ' కేటగిరీలోని ట్రేడర్, ట్రీటీ విజిటర్, ట్రీటీ అప్లికెంట్స్ ఫీజు 205 డాలర్ల నుంచి 315 డాలర్లకు పెరిగింది. ఇతర కాన్సులర్ ఫీజుల్లో మార్పులేదని అధికారిక ప్రకటన పేర్కొంది. వీసా జారీ చేసే సమయాన్ని తగ్గించేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్న అమెరికా హెచ్1బీ వీసాల స్టాంపింగ్ దేశం బయట కూడా చేసే విధంగా పైలెట్ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించింది. ఇది త్వరలోనే ఆచరణలోకి రాబోతోంది. ప్రస్తుతం వర్కింగ్ వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న భారతీయులు 60-280 రోజుల వరకు నిరీక్షించాల్సి వస్తోంది. ప్రయాణ వీసా కోసం ఏడాదిన్నర సమయం పడుతోంది. గతేడాది 1,25,000 మంది భారతీయులకు విద్యార్థి వీసాలను జారీ చేసి అమెరికా రాయబార కార్యాలయం రికార్డు సృష్టించడం విదితమే.

విశాలాంధ్ర ప్రపంచం

యుద్ధం ఆపండి... జర్మన్ల డిమాండ్

ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇవ్వొద్దంటూ ప్రదర్శనలు

బెర్లిన్: రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపాలని, శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ జర్మనీ ప్రజలు రోడ్లపైకొచ్చారు. ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇవ్వవద్దని కోరారు. ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తమ నిరసనను తెలిపేందుకు వేలాది మంది ఈస్టర్ సందర్భంగా శాంతి ప్రదర్శనలు చేపట్టారు. 120 నగరాల్లో ఈ ప్రదర్శనలు జరిగాయి. ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు. మూడు వేల మందికిపైగా ర్యాలీల్లో పాల్గొన్నారు. ఉక్రెయిన్ సమస్యకు దౌత్య పరిష్కారానికి ప్రయత్నించాలని సూచించారు. బెర్లిన్‌లోని వెడ్డింగ్ ప్రాంతంలోని స్క్వేర్ నుంచి ప్రదర్శనలు మొదలయ్యాయి. 'అమెరికా, నాటో ఉక్రెయిన్‌ను వీడండి'. దౌత్యం కావాలి, యుద్ధం కాదు' అన్న పోస్టర్లు, ప్లకార్డులను ప్రదర్శించారు. అవే నినాదాలు చేశారు. రష్యాపై చర్యల క్రమంలో ధరలు పెరగడంతో చవక ఇంధనం కోసం కూడా ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు.

కిమ్‌కు జిన్‌పింగ్ సౌహార్ద సందేశం

బీజింగ్/ప్యాంగ్యాంగ్: చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి జిన్‌పింగ్, కొరియా వర్కర్స్ పార్టీ (డబ్ల్యూపీకే) ప్రధాన కార్యదర్శి కిమ్ జాంగ్ ఉన్‌కు సౌహార్ద సందేశం పంపారు. అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపిన క్రమంలో ఆయన తాజాగా బదులిచ్చారు. చైనా చరిత్రలో కీలకమైన ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ముందుగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో కిమ్ ఒకరని జిన్‌పింగ్ పేర్కొన్నారు. రెండు పార్టీలు, రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలపర్చుకోవాలన్నారు. శాంతి, సుస్థిరత, పురోగతి, సుసంపన్నతకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. చైనా, ఉత్తర కొరియా మధ్య వ్యూహాత్మక సంబంధాలు, సహకారాన్ని మరింత పెంచుకోవాలని నొక్కిచెప్పారు. ఈ మేరకు జిన్‌పింగ్ పంపిన సందేశాన్ని కొరియా వర్కర్స్ పార్టీ కేంద్ర కమిటీ అంతర్జాతీయ శాఖాధిపతి కిమ్ సోంగ్ నామ్‌కు ప్యాంగ్యాంగ్‌కు చైనా రాయబారి వాంగ్ యజూన్ అందజేసి, కిమ్‌కు చేరవేయాల్సిందిగా కోరారు.

ఉ.కొరియా హెయిల్-2 ప్రయోగం విజయవంతం

ప్యాంగ్యాంగ్: మానవరహిత అణ్వాయుధ జలాంతర్గామి 'హెయిల్-2'ను ది డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డీపీఆర్‌కే) విజయవంతంగా ప్రయోగించింది. నీటిలో వెయ్యి కిమీలకుపైగా ఈ సబ్‌మెరైన్ ప్రయాణించినట్లు కేసీఎన్ఏ వార్తాసంస్థ తెలిపింది. ఈనెల 4-7 తేదీల్లో 71 గంటల ఆరు నిమిషాల పాటు ఎలిప్టికల్ మార్గంలో తూర్పు కొరియా సముద్రంలో నీటిలోపల ప్రయాణించింది. డ్రోన్ ద్వారా అణ్వాయుధాన్ని నీటి లోపల పేల్చినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ ప్రయోగంతో తాజా అణ్వాయుధ శక్తిసామర్థ్యాలు రుజువైనట్లు కేసీఎన్ఏ పేర్కొంది. శక్తిమంతమైన హెయిల్-2తో డీపీఆర్‌కే సాయుధ దళాల సామర్థ్యం మరింత పెరుగుతుందని, ఎలాంటి శత్రువునైనా కట్టడి చేసేందుకు ఇది ఎంతగానో దోహదమవుతుందని వెల్లడించింది.

పసుపు... గిట్టుబాటు ధర కరువు

(మొదటిపేజీ తరువాయి)

వేశారు. ఆ కమిటీలు ఇచ్చిన నివేదికలను చట్ట సభలలో చర్చించి అమలు చేసిన దాఖలాలు లేవు. ఆయా పంటల ఉత్పత్తుల విక్రయాలలో దళారీ వ్యాపారులు రైతులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొన్నేళ్లుగా నష్టాలే

గత కొన్ని సంవత్సరాలుగా పసుపు రైతులు నష్టపోతూనే ఉన్నారు. దిగుబడులు ఉంటే ధర ఉండదు. ధర ఉంటే దిగుబడులు ఉండడం లేదు. ఈ కారణంగా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతూ ఆర్థికంగా నలిగిపోతున్నారు. భూమి కౌలుతో కలుపుకుని ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి 1.70 లక్షల వరకు పెట్టుబడులు పెడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరకు పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలన రైతు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే భవిష్యత్తులో ఆహార భద్రతకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది.

రేపు చలో విజయవాడ

(మొదటిపేజీ తరువాయి)

చంపడం, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో షేక్ షాహిదా అనే దూదేకుల కుటుంబానికి చెందిన 23 ఏళ్ల యువతిని మానభంగం చేసి హత్య చేయడం తగదన్నారు. నంద్యాలలో ఆటోడ్రైవర్ అబ్దుల్ సలాంపై దొంగతనం కేసు మోపి ఆయన ఇద్దరు పిల్లలు, భార్యతోసహా మొత్తం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడేలా చేసినటువంటి ఘటనలు అనేకమున్నాయని వివరించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చాక దాదాపు కేవలం ముస్లిం మైనార్టీలపైనే 100కుపైగా దుశ్చర్యలు సాగడం విచాకరమని, అరాచకాలను అరికట్టాల్సిన జగన్ సర్కార్ నిందితులకు కొమ్ముకాసే విధంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. దళితులు, మైనార్టీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4వ తేదీన విజయవాడలో సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో దళిత, మైనార్టీ, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించినట్లు గుర్తుచేశారు. దళితులు, మైనార్టీలపై జరుగుతున్న దాడులు, అకృత్యాలను నిరసిస్తూ ఈ నెల 11వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపట్టాలని ఈ రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. దళిత, మైనారిటీ, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఈ నెల 11న చేపట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాల్సిందిగా దళితులకు, ముస్లిం మైనార్టీలకు ప్రజాతంత్ర వాదులందరికీ రామకృష్ణ పిలుపునిచ్చారు.

సీఆర్ స్ఫూర్తితో ప్రజాపోరాటాలు

(మొదటిపేజీ తరువాయి)

చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి చెన్నకేశవరావు, ప్రజాపక్షం ఎడిటర్ కె. శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్ ఫౌండేషన్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ డి. కృష్ణకుమారి, ఆర్ మేనియా మాజీ రాయబారి టి.సురేశ్, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ జంధ్యాల ప్రభాకర్, వేములపల్లి కిరణ్ తదితరులు పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు భౌతికంగా మన వద్ద లేకపోయినా ఆయన ఆశయాల రూపంలో మనందరిలో ఉన్నాడని అన్నారు. సీఆర్ సుదీర్ఘకాలం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి అనేకమందికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితోనే ఆయన పేరు మీద సిఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నారాయణ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు స్ఫూర్తితోనే సీఆర్ ఫౌండేషన్‌ను నిర్వహించి అందులో వృద్ధాశ్రమాన్ని, నీలం రాజశేఖరరెడ్డి పరిశోధనా కేంద్రం, మహిళా సంక్షేమ కేంద్రం, ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను సాధించడం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు సోమూరి తుకారాం, డాక్టర్ పి.సరస్వతి, రాజేంద్ర రావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమ వాసులు, సీనియర్ సినీ నటులు కాకరాల, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో 3.15 లక్షలకు పైగా ఖాళీలు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయి. అత్యధికంగా 38,754 ఖాళీలు ఉత్తర రైల్వేలో ఉంటే ఆ తర్వాత స్థానాలలో 36,475 ఖాళీలతో పశ్చిమ రైల్వే, తూర్పు రైల్వే (30,141), సెంట్రల్ రైల్వే (28,650) ఉన్నాయి. ఏటా పదవీ విరమణలు జరిగే క్రమంలో ఖాళీలు ఏర్పడతాయని, ఇది నిరంతర ప్రక్రియని సీనియర్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. మూడేళ్లలో వేర్వేరు విభాగాలకు సంబంధించి 1,41,886 మంది రైల్వే ఉద్యోగులు పదవీ విమరణ పొందారు. 2019-20లో 50,051 మంది రిటైర్ కాగా 2020- 21లో 46,988, 2021-22లో 44,847 మంది రిటైరయ్యారు. ఖాళీలను భర్తీ చేసేందుకు రైల్వే నిర్విరామంగా పనిచేస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

వామపక్ష ఐక్యత అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే దేశాన్ని కాపాడుతుందని, మితవాద, ఫాసిస్టు రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుందని చెప్పారు. అందుకు పార్లమెంటు, శాసనసభలో కమ్యూనిస్టుల బలం పెరగాలని, అలా జరిగితేనే దేశ రాజకీయ స్వరూపాన్ని మార్చగలమని వక్కాణించారు. వామపక్ష ఐక్యతకు సీపీఐ, సీపీఎం మరింత సన్నిహితంగా, ఐక్యంగా పని చేయాలని, అన్ని స్థాయిల్లో పరస్పర విశ్వాసం, సమన్వయం అవసరమని రాజా సూచించారు. ఎర్రజెండాలు రెండు కాదు ఒకటేనని నిరూపించాలన్నారు. 1989లో కలకత్తాలో జరిగిన సీపీఐ జాతీయ మహాసభలో కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణకు నాటి ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు ప్రతిపాదన చేయగా, ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని గుర్తుచేశారు. 1992లో సీపీఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఇంద్రజిత్ గుప్తా, నాటి సీపీఎం ప్రధాన కార్యదర్శి హరి కిషన్ సింగ్ సుర్జీత్ అత్యంత సఖ్యతతో పని చేశారని రాజా గుర్తు చేశారు. దేశ కార్మిక వర్గ ప్రయోజనాల దృష్ట్యా సీపీఐ, సీపీఎం ఐక్యంగా పనిచేసేందుకు వీలుగా రాష్ట్ర స్థాయిలో ఉభయ పార్టీలు సమన్వయకమిటీలు ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర కమిటీలకు వారిద్దరూ సర్క్యులర్ పంపారని, కాని అది ముందుకు సాగలేదన్నారు. నాడు వారిద్దరితో సన్నిహితంగా పని చేసిన తాను, సీతారాం ఏచూరి ఉభయ పార్టీలకు ప్రధాన కార్యదర్శులం అయ్యామని, వామపక్షాల ఐక్యత, సమన్వయం కోసం తామిరువురం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న ఉభయ కమ్యూనిస్టు పార్టీల వివిధ స్థాయి నాయకత్వ ఉమ్మడి సమావేశం దేశానికే స్ఫూర్తిదాయకమని అన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన సీపీఐ జాతీయ మహాసభలో కమ్యూనిస్టుల ఏకీకరణ గురించి ప్రతిపాదించినట్లు చెప్పారు. అదానీ వ్యవహారాన్ని నిగ్గు తేల్చేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని ప్రతిపక్షాలు కోరుతుంటే, పార్లమెంటును అధికార బీజేపీ ముందుకు సాగనీయకుండా అడ్డుకుంటోందని రాజా విమర్శించారు. జేపీసీలో మెజారిటీ సభ్యులు బీజేపీ ఎంపీలే ఉంటారని కొందరు అంటున్నారని, అయినప్పటికీ జేపీసీని వేసేందుకు బీజేపీ ఎందుకు అంగీకరించడం లేదని నిలదీశారు. భారత దేశం సంక్షేమ రాజ్యమని రాజ్యాంగం పేర్కొన్నదని, కాని బీజేపీ ప్రభుత్వం సంక్షేమ రాజ్యం కాకుండా చేసిందన్నారు.

మోదీని ఓడించలేమనడం భ్రమ: ఏచూరి

అందరు కలిసి మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితే తప్ప దేశ రాజ్యాంగాన్ని కాపాడుకోలేమని సీతారాం ఏచూరి అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదాలను కాపాడుకునేందుకు ఒకవైపు ప్రజా ఉద్యమాన్ని చేస్తూ, మరోవైపు బీజేపీని ఓడించేందుకు లౌకికవాదులు, ప్రగతిశీల శక్తులు కలిసి రావాల్సిన అవసరం ఉందని, ఇందుకు ఒత్తిడి పెట్టాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉన్నదన్నారు. దేశంలో మోదీ గాలి ఉందనే ప్రచారం వాస్తవం కాదన్నారు. దేశంలోని ప్రచార సాధనాలు, మీడియా అన్ని బీజేపీ చేతిలోనే ఉన్నాయని, అవి మోదీని ఎవరూ ఓడించలేరనే ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇటీవల త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ శాసనసభలకు ఎన్నికలు జరిగాయని, ఆ రాష్ట్రాలలో మొత్తం 180 స్థానాలు ఉంటే, బీజేపీ 46 స్థానాలలోనే గెలిచిందని, 58 స్థానాలలో డిపాజిట్ కోల్పోయిందన్నారు. నాగాలాండ్‌లో రెండు స్థానాలే గెలిచిందని, త్రిపురలో మెజారిటీ కంటే రెండు సీట్లే ఎక్కువ గెలిచిందని, గతంలో గెలిచిన 17 స్థానాలలో ఓడిపోయిందన్నారు. అంతకుముందు హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీ ఓడిపోయి కాంగ్రెస్ గెలిచిందని, ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో 15 ఏళ్లు అధికారంలో ఉన్న బీజేపీ ఓడిపోయి ఆప్ గెలిచిందని, గుజరాత్‌లో మాత్రమే బీజేపీ తిరిగి గెలవగలిగిందన్నారు. ఈ వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉన్నదని, ఈ పని సీపీఐ, సీపీఎం తప్ప ఎవరూ చేయలేరని చెప్పారు. ఎన్నికల్లో ఓడిపోయినా బీజేపీ ప్రభుత్వమే వస్తుందని చెబుతున్నారని, అంటే సీబీఐ, ఈడీ, డబ్బును ఉపయోగించి ఇతర పార్టీల ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి పార్టీ ఫిరాయింపులకు పాల్పడి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే బీజేపీవారి పని అన్నారు. ఇప్పటికే గోవా, మధ్యప్రదేశ్, కర్నాటక , తదితర రాష్ట్రాలలో ఫిరాయింపులతో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మతోన్మాదానికి వ్యతిరేకంగా రాజకీయ, సైద్ధాంతిక పోరాటంకొనసాగించాలని అన్నారు. రెండు కమ్యూనిస్టు పార్టీల మధ్య కింది స్థాయి నుండి ఇలాంటి ఐక్యత రావడం ఈ దశాబ్దంలో ఎక్కడా జరగలేదని సీతారాం ఏచూరి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కలిగిన ఈ రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ వైభవాన్ని పునరుద్ధరించాలంటే కమ్యూనిస్టుల మధ్య ఐక్యత అనివార్యం, అవసరమని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం ఒక ముందడుకు వేశాయనీ, ఒక కొత్త మార్గాన్ని శోధించాయని, ఈ పనిని ఉభయ పార్టీల నాయకత్వాలు ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ నిర్ణయాన్ని కేంద్ర స్థాయిలో చర్చిస్తామని అన్నారు. ప్రతి రాష్ట్రంలో ఆయా నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా బీజేపీ ఓటమికి ప్రయత్నాలు చేయాలని అన్నారు. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా ఇక్కడ అభివృద్ధి చేద్దామనుకుంటే తెలంగాణ ప్రభుత్వం అడ్డుకుంటోందని అన్నారని, ఆయన ఖర్చు పెట్టేది ప్రజల సొమ్ము అని , అదేదో సొంత ఘనకార్యంగా చెప్పుకుంటున్నారని ఏచూరి విమర్శించారు. బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక అధికారాలను లాగేసుకుంటున్నారని, ఆ పార్టీ నాయకులపై సీబీఐ, ఈడీని ఉపయోగిస్తూ రాష్ట్రప్రభుత్వాలను అస్థిర పరుస్తున్నారని చెప్పారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ,గాడ్సే నోటి నుంచి ఊడిపడిన వ్యక్తి ప్రధాని మోదీ అని, ఆయన దేశానికే ప్రమాదకారి అని విమర్శించారు. మోదీ సామన్యుడు కాదని, ప్రత్యేకంగా వచ్చిన గాడ్సే, ఆర్ఎస్ఎస్ సంస్కృతి ఉట్టిపడేలా వ్యవహరిస్తున్నారన్నారు. మోదీకి 30మంది దత్తపుత్రులు ఉన్నారని, ఇందులో 29 మంది ఎక్కడికోవెళ్లి దాక్కున్నారని, అదానీ మాత్రం ఇక్కడే ఉన్నారన్నారు. అధ్యక్షపదవి, జ్యూడిషియల్, అనుకూలంగా ఉన్నవారిని గవర్నర్లుగాను, రాజ్యసభకు పంపిస్తారా? అని ప్రశ్నించారు. సీబీఐని పెంపుడు కుక్కలాగా ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. ప్రధాని మంత్రివర్గంలో 24 మందిపైన హత్య, అత్యాచారం, రక రకాలుగా కేసులు ఉన్నాయని తెలిపారు. దొంగలను దోపిడీదారులను పెట్టుకుని, అవినీతిని నిర్మూలిస్తామంటే ఎవరు నమ్ముతారని నారాయణ ప్రశ్నించారు. బ్లాక్ మనీని మొత్తం తెల్ల డబ్బులుగా అయ్యాయని తెలిపారు. దేశం మొత్తంగా ఉన్న బ్యాంక్ ఖాతాల లెక్కలు బయటికి తీస్తే లెక్కలు కనిపిస్తాయని తెలిపారు. బీవీ రాఘవులు మాట్లాడుతూ, రాబోయే 2024లో పొరపాటున మళ్లీ బీజేపీనే అధికారంలోకి వస్తే దేశ భవిష్యత్ అంధాకారమేనని,భారతదేశం సర్వనాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం అభివృద్ధి చేసే ప్రభుత్వం కాదని, అమ్మకాలు చేసే ప్రభుత్వమని విమర్శించారు. బీజేపీకి ఉత్తరాదిన సీట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయని, అందుకే దక్షిణాదిలో పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. ఫాసిజం బలపడి, ఫాసిస్టుల శక్తులకు అధికారం వస్తే ఎలాంటి వినాశకర ఫలితాలు వస్తాయో గతంలోనే చూశామన్నారు. ప్రతిపక్షాలు ఉన్న చోటనే అవినీతి ఉంటుందా? అని ప్రశ్నించారు. దేశంలో పెద్ద అవినీతి ఎక్కడైనా ఉంటే అది మోదీ ప్రభుత్వమేనని విమర్శించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, కమ్యూనిస్టు పార్టీలు ఏ రాజకీయ పార్టీ వద్దకు వెళ్లడం లేదని, ఇతర పార్టీలే వారి రాజకీయ అవసరాల కోసం కమ్యూనిస్టుల వద్దకు వస్తున్నాయని స్పష్టం చేశారు. బీజేపీని రాష్ట్రంలో అడుగు పెట్టనీయకుండా ఉండటమే కర్తవ్యంగా పెట్టుకుందామని, ఆ వైపుగా నడుద్దామని, కమ్యూనిస్టులు కాలానికే దిక్సూచి చూపిస్తారనేది రుజువు చేయాలన్నారు. అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వంద సంవత్సరాల చరిత్ర ఉన్న పార్టీలన్నారు. మనం ఎవరికి తలవంచొద్దని, మనం ఎవరికంటే తక్కువ కాదన్నారు. తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కాలిగోటితో సమానమని అన్నారు. కమ్యూనిస్టు పార్టీల స్థానం ఎప్పుడూ మారడం లేదని, మారిందల్లా ఇతర పార్టీల స్థానాలు మాత్రమే అని, తాము అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ బీజేపీకి వ్యతిరేకంగానే ఉన్నామని స్పష్టం చేశారు. కార్మిక వ్యతిరేక ధోరణిని కేసీఆర్ అవలంభిస్తే పోరాటం చేయడం తప్పదని హెచ్చరించారు.

11న బాగ్ సుందరయ్య పూలే జయంతి సభ

ఈ నెల 11వ తేదీన ఉభయ కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర కమిటీల అధర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కూనంనేని సాంబశివ రావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వామపక్ష ఐక్యత పై రాసిన పాటల సిడిని రాజా, ఏచూరి ఆవిష్కరించారు. తెలంగాణకు చెందిన అభ్యుదయ రచయితలు, వామపక్ష రచయితలు రచించిన 'మతోన్మాదాన్ని ఓడిద్దాం' అనే పాటల పుస్తకాన్ని నారాయణ, రాఘవులు ఆవిష్కరించారు.

గెహ్లోత్ ప్రభుత్వ పథకాలతోనే అధికారంలోకి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: రాజస్థాన్‌లో గెహ్లోత్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, భవిష్యత్‌లోనూ వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ నొక్కిచెప్పారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన చేశారు. గత బీజేపీ పాలనలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో విఫమయ్యారంటూ గెహ్లోత్ ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ సొంత పార్టీ నేత సచిన్ పైలట్ వ్యాఖ్యలు చేసిన క్రమంలో జైరాం రమేశ్ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. 'అశోక్ గెహ్లోత్ ముఖ్యమంత్రి రాజస్థాన్‌లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చారు. జనరంజక పథకాల ద్వారా పార్టీకి ప్రజాదరణ లభించింది. అనేక కొత్త పథకాలను గెహ్లోత్ ప్రభుత్వం అమలు చేసింది.

యువత కమ్యూనిస్టు పార్టీకి ఊపిరి కావాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-గన్నవరం: యువత కమ్యూనిస్టు పార్టీకి ఊపిరి కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ అన్నారు. ఆదివారం గన్నవరం సీపీఐ కార్యాలయంలో పెద్దు వెంకట శివరామకృష్ణ అధ్యక్షతన గన్నవరం ప్రాంత సమావేశంలో జరిగింది. ముఖ్య అతిథిగా కేవీవీ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ యువతే పార్టీకి పునాది అని, వారు స్థానిక సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక పరిస్థితి దిగజారుతున్నా పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీకి దోచిపెడుతున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా ఏడుగురితో కన్వీనర్ కమిటీ వేశారు. పెద్దు వెంకట శివరామకృష్ణ, అలవాల ఏసురాజు, ముద్దరబోయిన బాలు, గండికోట నారాయణ, విశ్వనాధపల్లి, రవిరాజు, దేవరపల్లి బుచ్చిబాబు ఉన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, కాట్రగడ్డ రామచంద్ర జోషి, కట్టవరపు విజయరావు, బందారు లక్ష్మయ్య, ఎం.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట టోకరా

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో కానిస్టేబుల్ మోసం
- నకిలీ ఆఫర్ లెటర్లు
- రూ.కోటిన్నరకు పైగా వసూలు

విశాలాంధ్ర-నంద్యాల: సాధారణంగా బయటి వ్యక్తుల చేతిలో మోసపోయిన వారు, అన్యాయానికి గురైన వారు పోలీసుల దగ్గరికి వెళతారు. దీనికోసం ఎస్పీలు ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే పోలీసులే మోసం చేస్తే పరిస్థితి ఏమిటి?. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యోగాలు ఇప్పిస్తామని కొందరు పోలీసులు పెద్ద ఎత్తున అమాయకులను మోసం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. లక్షల్లో జీతాలంటూ నిరుద్యోగ యువతను మోసగిస్తున్నారు. దొంగలు, నేరగాళ్లను పట్టుకోవాల్సిన ఓ పోలీస్ కానిస్టేబుల్ మోసగాడి అవతారమెత్తాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ స్నేహితులు, బంధువులను బురిడీ కొట్టించి కోటిన్నర రూపాయల వరకు టోకరా వేశాడు. నంద్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కుమ్మరి శివయ్య మోసాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తుండటంతో ఉన్నతాధికారులు సైతం నివ్వెరపోతున్నారు. అయితే బాధితుల్లో ముగ్గురు కానిస్టేబుళ్లు కూడా ఉండటం విశేషం. ఆ కానిస్టేబుల్‌కి రూ.లక్షలు ముట్టజెప్పినా సాఫ్ట్‌వేర్ కొలువులు రాకపోవడంతో బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దాదాపు ఏడాదిగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట కానిస్టేబుల్ శివయ్య అనేక మంది మోసగించి రూ.కోట్లు గుంజినట్టు ఆరోపణలు వస్తున్నాయి. తన కుటుంబ సభ్యుల్లో ఒకరికి గత ఏడాది రూ.40 లక్షల ప్యాకేజీతో బెంగళూరులోని ఓ ప్రధాన కంపెనీలో ఉద్యోగం వచ్చినట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నాడు. దీనిని నమ్మిన కొందరు నిరుద్యోగులు కానిస్టేబుల్ వద్దకు వెళ్లి తమ పిల్లలకు మంచి ప్యాకేజీతో ఉద్యోగం కావాలని అడిగారు. రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పిన కానిస్టేబుల్ వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. నంద్యాల పట్టణంలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కానిస్టేబుళ్లు కూడా తమ పిల్లల భవిష్యత్ కోసం కానిస్టేబుల్ శివయ్యను ఆశ్రయించారు. వారి నుంచి కూడా రూ.6 లక్షల వరకు వసూలు చేసిన కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించాడు. ఎన్ని రోజులైనా కంపెనీ నుంచి కాల్ లెటర్ రాకపోవడంతో డబ్బులిచ్చిన నిరుద్యోగులకు ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ ఆఫర్ లెటర్లను నకిలీ మెయిల్ ఐడీ, వాట్సాప్ నంబర్లతో పంపించేవాడు. వాటిలో పేర్కొన్న బెంగళూరు, హైదరాబాద్ నగరాల్లోని చిరునామాలకు వెళ్లి చూస్తే అక్కడ కంపెనీలు కనిపించేవి కావు. కొందరు ధైర్యం చేసి కానిస్టేబుల్‌ను నిలదీస్తే వారికి ఎంతో కొంత ముట్టజెప్పి ఫిర్యాదు చేయకుండా ఆపినట్టు తెలుస్తోంది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో కానిస్టేబుల్ శివయ్యను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు తెలిసింది. ఎంతమంది బాధితులు ఉన్నారు? ఎంత వసూలు చేశాడనే వివరాలు ఆరా తీస్తున్నారు. బాధితులను స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరిస్తున్నారు. విషయం బయటకు పొక్కుతుందని భావించిన కానిస్టేబుల్ శివయ్య మాత్రం బాధిత కానిస్టేబుళ్లకు విడతల వారీగా డబ్బు తిరిగి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ లోతుగా విచారించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఈఏపీసెట్‌కు గిరాకీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఈఏపీసెట్ ద్వారా కన్వీనర్ కోటా కింద 35 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. ఈ సీట్లను పూర్తిగా ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు. కన్వీనర్ కోటా ద్వారా ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో సీట్లు పొందిన అర్హులైన వారందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. దీంతో నాలుగు ఐఐటీ, నిట్‌లో సీటు సాధించని వారంతా ప్రైవేట్ విశ్వవిద్యాలయాలపై మొగ్గు చూపుతున్నారు. ఈనెల 6వ తేదీ నుంచి జేఈఈ (మెయిన్స్) సెకండ్ సెషన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 18 వరకు వాటిని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు ఏపీ నుంచి దాదాపు లక్షా 50 వేల మంది హాజరవుతున్నారు. రాష్ట్రంలోని 25 పట్టణాల్లో ఈ పరీక్షలను కంప్యూటర్ ఆధారితంగా నిర్వహిస్తున్నారు.

నాలుగేళ్ల నుంచి కౌన్సెలింగ్ ఆలస్యమే

నాలుగేళ్ల నుంచి ఏపీలో ఇంజినీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియ ఆలస్యంగా పూర్తవుతోంది. దీనివల్ల ఇతర రాష్ట్రాలకు ఏపీ అభ్యర్థులు తరలిపోతున్నారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యాక... గత ఏడాది జులై తర్వాత ఏపీలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఫార్మసీ, అగ్రికల్చర్ ప్రవేశాలు ఇంకా ఆలస్యమయ్యాయి. ఈ జాప్యంతో అప్పటికే కొంత మంది విద్యార్థులు తెలంగాణ ఎంసెట్ ద్వారా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సీట్లు పొందారు. మరికొందరు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో యాజమాన్య కోటాలో సీట్లు కైవసం చేసుకున్నారు. ఈ కౌన్సెలింగ్ జాప్యంతో విద్యార్థులు తీవ్ర నష్టానికి గురయ్యారు. వేలాది ఇంజినీరింగ్ సీట్లు మిగిలిపోవడంతో అటు ప్రభుత్వానికి, ఇటు యాజమాన్యానికి నష్టం వాటిల్లింది.

15 వరకు ఏపీఈఏపీసెట్ దరఖాస్తులు

ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు గడువు ఈనెల 15వ తేదీతో ముగియనుంది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలను వరుస వారీగా ఈనెల 15వ తేదీ నుంచి 23 వరకు జరుగుతాయి. ఓసీ అభ్యర్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.600, బీసీలకు రూ.550, ఎస్సీ, ఎస్టీలకు రూ.500 చొప్పున నిర్దేశించారు. రూ.500 అపరాధ రుసుముతో ఈనెల 30వ తేదీ వరకు, రూ.1000 అపరాధ రుసుముతో మే 5 వరకు, రూ.5 వేల అపరాధ రుసుముతో మే 12 వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో మే 14 వరకు ఏపీఈఏపీసెట్‌కు దరఖాస్తులు స్వీకరణకు గడువు విధించారు.

మే 15 నుంచి 23 వరకు ఏపీఈఏపీసెట్ పరీక్షల షెడ్యూలు ఉంది. ఆ తర్వాత ఫలితాలు వచ్చేసరికి మరో రెండు వారాలు పడుతుంది. జూన్ వరకు ఈఏపీసెట్ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ విద్యా సంవత్సరమూ జూన్-జులైలో ఇంజినీరింగ్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని రాబోయే విద్యా సంవత్సరానికి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రజల మత్తు వదిలించే సాంస్కృతికోద్యమం కావాలి

సీఆర్ వర్ధంతి సభలో డీవీవీఎస్ వర్మ

విశాలాంధ్ర-ఒంగోలు: దేశంలో కార్పొరేట్ శక్తులు వద్ద పోగుపడ్డ ప్రజాధనం పంపిణీ జరిగేలా, ప్రజలను కులం, మతం మత్తును వదిలించే సాంస్కృతిక ఉద్యమాల ద్వారానే కేంద్రంలోని మోదీ దుష్పరిపాలనకు చరమగీతం పాడగలుగుతామని మార్క్సిస్టు మేధావి డీవీవీఎస్ వర్మ అన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సీపీఐ జాతీయ నాయకులు అమరజీవి చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతిని పురస్కరించుకొని శాస్త్రీయ సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో వర్తమాన భారతదేశం, వామపక్ష ఐక్యత, ఆవశ్యకత అనే అంశంపై చర్చా గోష్టి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. తొలుత చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్మ మాట్లాడుతూ వామపక్ష పార్టీలు లేకుండా దేశం ముందుకు సాగదన్నారు. దేశంలో గతంలో ఎన్నడూ లేనంతగా కార్పొరేట్ శక్తుల ప్రాబల్యం పెరిగిందన్నారు. ప్రకృతి సంపద, ఉత్పత్తి సంపద అంతా కార్పొరేట్ల చేతుల్లోకి పోతోందన్నారు. గతంలో ప్రభుత్వరంగందే పైచేయిగా ఉండేది అన్నారు. మోదీ పాలనలో దేశంలోని అన్ని పోర్టులు, విమానాశ్రయాలు, సముద్రతీరం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి పోయాయన్నారు. 55 శాతం సంపద కేవలం ఒక్క శాతంగా ఉన్న కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఉందన్నారు. మోదీ మిత్ర బృందం చేతుల్లో సంపద అంతా కేంద్రీకరణ చేసి పోగు వేశారన్నారు. ప్రతి బడ్జెట్లోనూ కార్పొరేట్లకే రాయితీలు ఇస్తున్నారు. 9 సంవత్సరాల ఎన్డీయే పాలనలో కార్పొరేట్ శక్తులకు దాదాపు 30 లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇచ్చారన్నారు. వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్ శక్తులు కబళించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారన్నారు. అచ్చేదిన్ పేరుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశంలోని ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత అసంఘటిత రంగం కుప్పకూలిపోయిందన్నారు. నిరుద్యోగం పెరిగింది అన్నారు. జీఎస్టీ పేరుతో 60 శాతం మందిగా ఉన్న సామాన్య ప్రజల నుంచి పన్ను వసూలు చేశారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌లను తెచ్చారన్నారు. దీంతో ప్రస్తుతం కార్మికులు సంఘం పెట్టుకునే హక్కులు కూడా కోల్పోయారని చెప్పారు. మోదీ పాలన అంతా ఎన్నికల మీద, విదేశీ పర్యటనల మీద సాగిందన్నారు. వెనక చూపుల మోదీ పాలన దేశాభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. అయినా మోదీ పాలనపై ప్రజలలో వ్యతిరేకత రాకపోవటానికి కారణం ప్రజలను చైతన్యం పరచటంలో లోపం జరిగిందన్నారు. కార్పొరేట్ శక్తుల వద్ద ఉన్న ప్రజాధనం పంపిణీ జరగాలన్నారు. అందుకు మంచి మార్గాన్ని ఆలోచించాలి అన్నారు. ప్రజల మత్తును వదిలించే సాంస్కృత్యోద్యమం ద్వారానే మోదీ పాలనను అంతం చేయవచ్చని వర్మ అన్నారు. సామాజిక రాజకీయ విశ్లేషకులు మొలకలపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కమ్యూనిస్టు పార్టీల ఉద్యమాలు ఆకర్షణీయంగా లేకపోవటంతో కొత్త శక్తులు ఈ పార్టీల వైపు రాలేకపోయాయన్నారు. మోదీ హైదరాబాదులో వందే భారత్ రైలును ప్రారంభిస్తూ భాగ్యలక్ష్మి నగర్ నుంచి వెంకన్న నగర్ వరకు వందే భారత్ అంటూ ఇప్పటివరకు రాజ్యాంగంలో లేని, ప్రజల వాడుక భాషలో లేని పేర్లను మాట్లాడుతూ ప్రధాని స్థాయిని మరింతగా దిగజార్చి మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా విషపూరితంగా ప్రసంగాన్ని కొనసాగించారన్నారు. 70 సంవత్సరాలు క్రితం బాబ్రీ మసీదులో రాముడి బొమ్మను ఉంచి అయోధ్య వివాదానికి కారణమైనట్లే, హైదరాబాదులోని పాతబస్తీలోని చార్మినార్ సమీపంలో భాగ్యలక్ష్మి దేవి విగ్రహాన్ని పెట్టి ప్రతి కార్యక్రమాన్ని అక్కడ నుంచే ప్రారంభిస్తూ బీజేపీ విద్వేషపూరితమైన, మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తూ వివాదాలకు కేంద్రబిందువుగా మారుతోందన్నారు. హుస్సేన్ సాగర్ ను వినాయక సాగర్ అంటూ కొత్త పేర్లను సృష్టిస్తున్నారన్నారు. గత చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధాని మత భావజాలాన్ని వాడుకొని ఓట్ బ్యాంకు గా మార్చుకోవాలని చూస్తున్నారన్నారు. ఆర్ఎస్ఎస్ నాటిన పిచ్చి మొక్కల పాలనలో నేడు దేశం అల్లకల్లోలంగా మారిందన్నారు. హిడెన్ బర్గ్ అదానీ అక్రమాలను బహిర్గతం చేస్తే మోదీ కనీసం పార్లమెంటరీ కమిటీ వేసేందుకు కూడ వెనకాడుతూ నోరు మెదపకుండా చోద్యం చూస్తున్నారన్నారు. వివిధ దేశాల అనుభవాలను తీసుకొని కమ్యూనిస్టు పార్టీల ఐక్యత వైపు దృష్టి సారించడం ఎంతో శ్రేయస్కరం అన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), సీపీఎం రాష్ట్ర నాయకులు వై సిద్దయ్య, శాస్త్రీయ సామ్యవాద అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎం వెంకయ్య, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు నరసింహారావు, లలిత కుమారి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిజం పత్రిక సంపాదకులు ఎంసీ వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, కె వీరారెడ్డి,ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి, ప్రొఫెసర్ మనోరమ, ఎస్డి సర్దార్, ఉప్పుటూరి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు-అమలుపై

13న చర్చావేదిక

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నేతలు జల్లి విల్సన్, ఆవుల శేఖర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల13వ తేదీ ఉదయం 10.30 గంటలకు విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో 'కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు-అమలు'పై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం చర్చా వేదిక నిర్వహించనుంది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జల్లివిల్సన్, ఆవులశేఖర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చర్చావేదికను ప్రముఖ న్యాయవాది (నల్సార్ యూనివర్సిటీ-హైదరాబాద్), భూచట్టాల నిపుణులు ఎం.సునీల్‌కుమార్ ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్రంలో పడావుగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, ఆరుగాలం కష్టపడే గ్రామీణ శ్రమజీవులకు శాశ్వత ఉపాధి, సామాజిక గౌరవం, న్యాయం కల్పించాలన్న సదుద్దేశంతో ఎర్రజెండా పార్టీలు, సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రత్యక్ష భూ పోరాటాల ఫలితంగా 2006లో భూ పంపిణీ ప్రక్రియకు అప్పటి ప్రభుత్వం కోనేరు రంగారావు భూ కమిటీ ఏర్పాటైందని గుర్తుచేశారు. ఆ కమిటీ 104 సిఫార్సులు అమలు చేయగా రాష్ట్ర ప్రభుత్వం 74ను ఆమోదించిందన్నారు. భూ పంపిణీ కార్యక్రమం కొంత మేరకే జరిగిందని, ఆ తర్వాత వచ్చిన పాలకులకు చిత్తశుద్ధి లేనందున సిఫార్సులు చీకటి గదిలో బంధించాయని పేర్కొన్నారు. ఈ భూ కమిటీ సిఫార్సుల అమలు బాధ్యత భూ కమిటీ సాధించుకున్న సంఘాలపై ఉందని, ఐక్య పోరాటాల ద్వారానే ఇది సాధ్యమని తెలిపారు. చర్చావేదికకు రాష్ట్ర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సేవాసంస్థల అధ్యక్ష, కార్యదర్శులను, కన్వీనర్లను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. గ్రామీణ పేదలకు సాగుభూములు దక్కించుకునేందుకు, తిండి గింజల హామీ కోసం అందరూ మద్దతివ్వాలని, చర్చావేదికకు హాజరు కావాలని జల్లి విల్సన్, ఆవులశేఖర్ కోరారు.

కర్నూలు జర్నలిస్టుల స్థలాల్లో...

ఎర్రమట్టి తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలి

సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్నూలు జగన్నాథగట్టుపై జర్నలిస్టులకు కేటాయించిన స్థలాల్లో అక్రమంగా ఎర్రమట్టి తవ్వుతున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సీఎం వైఎస్ జగన్‌కు ఆదివారం ఆయన ఒక లేఖ రాశారు. కర్నూలు నగరంలో జర్నలిస్టుల కోరిక మేరకు 2009లో అప్పటి సీఎం స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి జగన్నాథగట్టు మీద సర్వే నంబరు 436లో 15 ఎకరాల 44 సెంట్లు భూమిని ది కర్నూల్ జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కేటాయించారని గుర్తుచేశారు. ఇందుకుగాను జర్నలిస్టులు అప్పటి మార్కెట్ ధర ప్రకారం రూ.65 లక్షలు ప్రభుత్వానికి చెల్లించారని వివరించారు. ఆయా స్థలాల్లో అధికారులు ఇప్పటివరకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదని, అక్కడ విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో జర్నలిస్టులు ఇళ్లను నిర్మించుకోలేకపోయారని తెలిపారు. ఇదే అదనుగా భావించిన ఎర్రమట్టి (గ్రావెల్) మాఫియా జగన్నాథ గట్టులో ఎలాంటి అనుమతులు లేకుండా ఎడాపెడా మట్టి తవ్వకాలు చేస్తున్నారని, చివరకు జర్నలిస్టులకు కేటాయించిన స్థలాల్లో కూడా భారీగా తవ్వకాలు చేపట్టారని పేర్కొన్నారు. రాత్రి వేళలలో ప్రొక్లెయిన్లు పెట్టి తవ్వకాలు చేస్తున్నారని, దీంతో 20 అడుగుల మేర గోతులు ఏర్పడి, దాదాపు 60 మంది జర్నలిస్టుల ప్లాట్లు రూపురేఖలు మారిపోయాయని, ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా లేకుండా పోయాయని తెలిపారు. అక్కడ ఇళ్లు కట్టుకోవాలంటే కూడా కట్టుకోలేని పరిస్థితి ఉందని, నేటికీ జర్నలిస్టులకు కేటాయించిన స్థలాల్లో యదేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయని, దీనిపై జర్నలిస్టులు అనేక సార్లు జిల్లా కలెక్టర్, ఎస్పీ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దాదాపు 1.70 వేల క్యూబిక్ మీటర్ల మేర మట్టి తవ్వకాలు అక్రమంగా జరిగినట్లు మైనింగ్ అధికారులు గుర్తించారని, మట్టి మాఫియా వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి రూ.9 కోట్ల మేర నష్టం జరిగిందనీ, తక్షణ చర్యల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు మైనింగ్ అధికారులు నివేదికలో పేర్కొన్నారని వివరించారు. ఇప్పటివరకు మట్టి తవ్వకాలకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఇప్పటికైనా మీరు స్పందించి జగన్నాథగట్టుపై మట్టి తవ్వకాల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారించాలని, బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రూ.9 కోట్లు అక్రమార్కుల నుంచి రికవరీ చేయాలని, జర్నలిస్టుల స్థలాల్లో అక్రమ తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చివేయించి, జిల్లా సర్వేయర్ ద్వారా రీ సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేయించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ఉద్యమానికి భాషోపాధ్యాయుల మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్‌దారుల డిమాండ్ల సాధన కోసం ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన మలిదశ ఉద్యమానికి రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ సంపూర్ణ మద్దతిచ్చింది. రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, ఆంధ్రప్రదేశ్ అత్యవసర రాష్ట్ర కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు అంకాల్ కొండయ్య అధ్యక్షతన విజయవాడ లెనిన్‌సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, పెన్షనర్ల, ఒప్పంద, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు బొప్పరాజు వెంకటేశ్వర్లు నాయకత్వంలో ఏపీజేఏసీ, అమరావతి మలివిడత ఉద్యమ కార్యాచరణకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని భాషోపాధ్యాయ సంస్థ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకాల్ కొండయ్య, గాండ్లపర్తి శివానందరెడ్డి తెలిపారు. అన్ని జిల్లాల నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ భాషోపాధ్యాయులు దీర్ఘకాలంగా పోరాడిన భాషోపాధ్యాయ పోస్టుల ఉన్నతీకరణకు నిర్మాణాత్మక సహకారం అందించామన్నారు. భాషోపాధ్యాయులను వేధిస్తున్న డీఈవో పూల్ సమస్య, పరిధిలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నతపాఠశాలలోని భాషాపండిత పోస్టుల ఉన్నతీకరణ, సర్వీసు కాలంలోనే 398 నోషనల్ ఇంక్రి మెంట్ల మంజూరు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, ఆంధ్రప్రదేశ్‌కు ప్రభుత్వ గుర్తింపు తదితర సమస్యల పరిష్కారానికి ఏపీజేఏసీ పక్షాన కృషిచేస్తామని హామీ ఇచ్చారు. భాషోపాధ్యాయులు అందరూ ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో భాగస్వాములై నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

స్థానిక సమస్యలపై సీపీఐ సమరశంఖం

14 నుంచి పాదయాత్రలు : ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-సత్తెనపల్లి: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోని ప్రజా సమస్యలపై సీపీఐ సమరశంఖం పూరిస్తుందని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. వామపక్ష కూటమి అధ్వర్యంలో నియోజకవర్గ సమస్యలపై యాత్రలు చేపట్టాలని సీపీఐ సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర సమస్యలపై కేంద్రాన్ని నిలదీయడంలో ముఖ్యమంత్రి జగన్ పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ప్రజలను కులాలు, మతాలు, వర్గాల పేరుతో విభజించి పాలిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపే సమయం ఆసన్నమైనదన్నారు. పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీప్రసాద్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలకు ప్రజలు సంఘీభావం తెలపాలన్నారు. సమావేశంలో సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గ నాయకులు నరిశెట్టి వేణుగోపాల్, నరసింహారావు, కంబాల శ్రీనివాస్, శ్రీనివాసరావు, శరత్, రామకృష్ణ, చెన్నకేశవులు, సుభాని పాల్గొన్నారు.

సీఆర్ ఆశయాలు కొనసాగిస్తాం

30వ వర్ధంతి సభలో డేగా ప్రభాకర్

విశాలాంధ్ర - కాకినాడ : తొలితరం కమ్యూనిస్టు, ఉద్యమ అగ్రనాయకులు చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగ ప్రభాకర్ ఉద్ఘాటించారు. చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధుతో పాటు దేగా ప్రభాకర్ కాకినాడ బాలచెరువు సెంటర్‌లో సీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేగ ప్రభాకర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు విలువల చిరునామా... చంద్ర రాజేశ్వర రావు వీలునామా అని అన్నారు. 'ఆంధ్రాలోని కృష్ణా జిల్లా, చల్లపల్లికి దగ్గరగా ఉన్న మంగళాపురం గ్రామంలో చంద్ర రాజేశ్వరరావు జన్మించారు. పేదలకు సాగుభూముల సాధన కోసం చిన్న వయసులోనే చల్లపల్లి రాజాకు వ్యతిరేకంగా పోరాటానికి నాయకత్వం వహించారు. తన వాటాగా వచ్చిన భూములను పేదలకు పంచారు. కమ్యూనిస్టు ఉద్యమ అగ్ర నాయకులుగా ఎదిగారు. రాజేశ్వరరావు తన వీలునామాలో కూడా కమ్యూనిస్టు ఉన్నత విలువలు, సంప్రదాయాలు అంటే ఏమిటో చూపారు' అని అన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కార్యదర్శి కె. బోడకుండా, కోనసీమ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, జిల్లా సహాయ కార్యదర్శులు తోకల ప్రసాద్, జి.లోవరత్నం, కార్యవర్గ సభ్యులు పీస్ నారాయణ, పి.సత్యనారాయణ, శివకోటి రాజు, టి.అన్నవరం పాల్గొన్నారు.

దళితులపై హత్యలు అత్యంత హేయం

- దళిత బహుజన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
- 11న చలో విజయవాడకు పిలుపు

విశాలాంధ్ర-విశాఖ : దేశంలోనూ, రాష్ట్రంలోనూ దళితులపై దాడులు, హత్యలు విపరీతంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ ధ్వజమెత్తారు. విశాఖలోని బుల్లయ్య కళాశాల వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో ఆదివారం దళితులపై దాడులకు వ్యతిరేకంగా డీహెచ్‌పీఎస్, కేవీపీఎస్, ఏఎంఎస్, దళిత జేపీసీ, ప్రజా సంఘాల అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జె.వి.ప్రభాకర్ అధ్యక్షత వహించి ఇటీవల పి.ఎల్ పురంలో నాగేంద్ర హత్య, శృంగవృక్షంలో రాము హత్య, కడప జిల్లాలో డాక్టర్ అచ్చెన్న హత్య... ఇలా దారుణాలు తరచూ జరుగుతున్నా, వాటిని అదుపు చేయడంలో జగన్ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. వైసీపీ నాయకుడు, ఎమ్మెల్సీ అనంత బాబు తన కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హతమార్చి, డోర్ డెలివరీ చేసినా అతనిపై పార్టీ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అతనికి బెయిల్ రావడానికి పోలీసులు, ప్రభుత్వమే కారణమని మండిపడ్డారు. మనువాద బీజేపీ పాలనలో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని, దేశం ప్రమాదంలో పడిందని, రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు సాగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న దళిత, బహుజన, ప్రజాసంఘాల అధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దానిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణ రావు మాట్లాడుతూ 72 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో దళితులు ఇంకా అంటరానితనం, అణచివేత, హంతక దాడులకు గురవుతూనే ఉన్నారన్నారు. స్వాతంత్ర్య ఫలాలు వారికి ఇంకా చేరలేదని, దానికి రాజ్యాధికారమే మార్గమని అభిప్రాయపడ్డారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు మాట్లాడుతూ దళితులపై దాడుల నివారణకు పోరాడి సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు బాధ్యత జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులదేనన్నారు. వారు తగిన రీతిలో చర్యలు చేపడితే హత్యల పరంపర కొనసాగేది కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. భీమ్ సేన వ్యవస్థాపకుడు ఎం.రవి సిద్ధార్థ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం వేల సంఖ్యలో దళితులపై హత్యాకాండ కొనసాగుతోందని, లెక్కల్లో లేనివి లక్షల్లో ఉన్నాయన్నారు. విశ్వవిద్యాలయాలలో ఆధిపత్య కులాల అణచివేతను భరించలేక అనేకమంది దళిత విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు చెందిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి, దగా చేసిందన్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలను ఖండిస్తూ ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేయటం, తప్పుడు కేసులు బనాయించడం వంటి చర్యలకు పాల్పడుతూ నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని అడుగుతుంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని విమర్శించారు. న్యాయవాది అహ్మద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వైద్య విద్యను దూరం చేసే ఆలోచనతో మోదీ ప్రభుత్వం విధానాలు రూపొందించిందని, వాటిని ఎదుర్కోవాలని అన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ నాయకులు టి.చిరంజీవి, సుబ్బన్న, రాజు, డీహెచ్‌పీఎస్ నాయకులు జి.రాంబాబు, ఎం.సత్యనారాయణ, జి.కృష్ణ, ఏఐటీయూసీ నాయకుడు వామనమూర్తి, టీడీపీ నాయకుడు గోవిందు, కాంగ్రెస్ నాయకుడు సుధాకర్, మైనార్టీ నాయకులు రెహమాన్, బేగం, ఏఎంఎస్ నాయకులు బొడ్డు నాయుడు, రాజాన సరస్వతి, జై భీమ్ సంస్థ ప్రతినిధి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన సరదా

ఈతకు వెళ్లి ముగ్గురి మృతి

విశాలాంధ్ర-వేంపల్లె: ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటన వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం, అలవలపాడులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన తుమ్మలూరు సాయి సుశాంత్ (11), తుమ్మలూరు సాయి తేజశ్రీ (12), వేముల మండలం వేల్పుల గ్రామానికి చెందిన ఓ.జానయ్య (23), ఓ.శశి కుమార్ ఆదివారం మధ్యాహ్నం సరదాగా జీఎన్ఎస్ కాలువలో ఈతకు వెళ్లారు. ఈదే క్రమంలో పిల్లలు ఇద్దరూ లోతున్న ప్రాంతానికి వెళ్లి మునిగిపోయారు. వీరిని కాపాడే క్రమంలో జానయ్య లోతు ఎక్కువన్న ప్రాంతానికి వెళ్లగా శశికుమార్ మాత్రం కొద్ది సేపు వెతికిన తర్వాత, బయటకు వచ్చి కేకలు వేశాడు. స్థానికులు గమనించి అక్కడికి చేరుకుని ముగ్గురిని కాలువ నుంచి బయటకు తీశారు. అప్పటికే వారు మృతి చెందారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం కోసం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుశాంత్, తేజశ్రీ తల్లిదండ్రులు రూతు, సురేష్ చక్రాయిపేట మండలం చిలేకాంపల్లిలో నివాసం ఉండేవారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తల్లి రూతు మృతి చెందగా తండ్రి బతుకుదెరువు కోసం యర్రగుంట్లలో కూలిపని చేస్తున్నాడు. ఈ క్రమంలో పిల్లలిద్దరూ గ్రామంలోని అమ్మమ్మ శశికళ దగ్గర ఉంటూ వేంపల్లెలోని నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చదువుకుంటున్నారు. జానయ్య పులివెందులలో బైక్ మెకానిక్. ఆరు నెలల క్రితం వీరపునాయునిపల్లె గ్రామం పాలగిరి గ్రామానికి చెందిన శృతితో వివాహమైంది. ఈస్టర్ పండుగ సందర్భంగా అలవలపాడు గ్రామంలోని శశికళ ఇంటికి దంపతులిద్దరూ వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం సరదాగా ఈత కోసమని జానయ్య, శశికుమార్‌లు పిల్లలను జీఎన్ఎస్ కాలువ వద్దకు తీసుకెళ్లగా ఈ విషాదం చోటుచేసుకుంది.

దళితులు, గిరిజనులపై దాడులను అరికట్టాలంటూ

రేపు సీపీఎం నేత శ్రీనివాసరావు 'పూలే దీక్ష'

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఆయా ఘటనల్లో ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ జ్యోతిబాపూలే 196వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు 'పూలే దీక్ష' చేపట్టనున్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన చేశారు. తన దీక్షకు మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, విద్యావంతులు, ప్రజల మద్దతును కోరారు. కడపలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చన్న హత్య కేసు, కాకినాడ జిల్లా శృంగవృక్షంలో దళిత యువకుడి హత్య, నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలో దళితునిపై దాడులు, ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య, వాకపల్లి గిరిజన మహిళలపై అత్యాచారం వంటివి దళితులపై దాడులకు తార్కాణాలన్నారు.దళిత, గిరిజనుల రక్షణకున్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం నిందితులకే కొమ్ము కాస్తున్నాయని తెలిపారు. ఈ ఘటనలపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సామాజిక విప్లవకారుడు జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా జరుగుతున్న దీక్షలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నిషిద్ధ భూముల వివరాలు వెల్లడించాలి: సీపీఎం

రాష్ట్రప్రభుత్వం అక్రమార్కుల భూములను క్రమబద్ధీకరించడానికే రెండు లక్షల ఎకరాలను నిషిద్ధ జాబితా 22(ఏ) నుంచి తప్పించిందన్న వార్తల నేపథ్యంలో ఆ భూముల వివరాల్ని తక్షణమే బహిరంగపరచాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానంతరం భూముల సర్వే (ఆర్ఎస్ఆర్) చేసిన సందర్భంగా తమ బతుకుతెరువు కోసం కొంతమంది పేద రైతులు వలస వెళ్లడంతో, సర్వే సమయంలో అందుబాటులో లేకపోవడం వల్ల అలాంటి భూములను ప్రభుత్వ భూములతో సమానంగా నిషిద్ధ భూములని చుక్కలు పెట్టారని తెలిపారు. ఆ భూములు అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు చేసే పరిస్థితి లేదన్నారు. నిషిద్ధ భూములలో నిజమైన హక్కుదారులు 25లక్షల వరకు ఉంటారని గత టీడీపీ ప్రభుత్వం ప్రకటించిందని, వాటికి రిజిస్ట్రేషన్ హక్కు కల్పించాలని 22(ఏ)ను ఎత్తివేయాలని కొందరు రైతులు హైకోర్టుకు వెళ్లారని గుర్తుచేశారు. పేదల భూములను క్రమబద్ధీకరించడానికి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని, ఇది సరికాదని తప్పుపట్టారు. ఉచితంగా భూములను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా సాగులో ఉన్న సన్న, చిన్నకారు రైతుల భూములను రెగ్యులరైజ్ చేయాలని, అనర్హులకు రెగ్యులరైజ్ చేసిన భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా హైకోర్టు తీర్పును అమలు చేసి సన్న, చిన్నకారు రైతుల చుక్కల భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ORIYO GREEN FERTILISERS

Notice for storage and sales of 100% water soluble mixture of fertilizers

We are pleased to inform the general public that with reference to the order No.2900(E) dated 24th October 2015 issued by Ministry of Agriculture and Farmer Welfare and amendment thereafter Oriyo Green Fertilisers Ltd will commence the storage and sales of 100% water soluble mixture of fertilizers 19:19:19 ,13:40:13 ,20;20:20 ,13:05:26,18:18:18,6:12:36,12:30:15, , Urea phosphate with sop ,12:32:14, 00:00:50 (Potassium sulphate) , 28:28:00, NPK Zn and NPK Zn B, Calcium nitrate with boron in the state of Andhra Pradesh .

The Product specifications are given below

Composition	NPK 19:19:19	NPK 13:40:13	NPK 20:20:20	NPK 13:05:26	NPK 18:18:18	NPK 06:12:36	NPK 12:30:15	Urea phosphate with sop 18:18:18:6.1	NPK 12:32:14	Potassium sulphate 00:00:50	NPK 28:28:00	NPK Zn 7.6:23.5:7.6:3.5	NPK Zn B 12:0:42:0.7:0.3	Calcium Nitrate with Boron 14.5:17:0.25
Total nitrogen percent by weight,Minimum	19	13	20	13	18	6	12		12		28	7.6	12	14.5
Nitrate nitrogen percent by weight,Maximum	4	4.4	4.9	7	9.8	4.5						2.8		13.5
Ammonical nitrogen percent by weight,minimum	4.5	8.6	3	6	8.2	1.5					5	5		1.1
Urea nitrogen percent by weight ,Maximum	10.5		12.1					18			23			
Water soluble phosphorus(p2o5)by percent weight ,Minimum	19	40	20	5	18	12	30	18	32		28	23.5		
Water soluble Potassium(K2O)by %weight ,Minimum	19	13	20	26	18	36	15	18	14	50		7.6	42	
Water soluble Sulphur(as S) percent by weight minimum							5.2	6.1	4.8	17.5			0.7	
Water soluble zinc(as Zn EDTA) percent by weight minimum												3.5	0.3	
Watersoluble calcium (as Ca) percent by weight ,minimum														17
Water soluble Boron (as B)percent by weight minimum														0.25
Total chloride percent by weight ,Maximum										2.5				
Matter insoluble in water percent by weight ,maximum				0.3	0.5			0.5	0.5					
Sodium (as Nacl) percent by weight ,Maximum				0.5	0.5					2		0.15	0.15	
Moisture percent by weight ,Maximum							0.5	0.5	0.5	1.5		0.5	0.5	

ORIYO GREEN FERTILISERS

Regd. Office & Factory : # Sy.No. 74/3/74/ 4, Old Andhra Cable Compound,
Beside Shiridhi Sai Electriclas, Industrial Estate, Kadapa, AP – 516 004.

సాహితి

ఆరని అభ్యుదయ దీప్తి భీష్మ సాహ్నీ

భీష్మ సాహ్నీ పుట్టింది పాకిస్తాన్ లోని రావల్పిండీలో. మాతృ భాష పంజాబీ. చదివింది ఇంగ్లీషు. రాసింది హిందీ, ఇంగ్లీషు లో. సంస్కృతం, రష్యన్ భాషలు నేర్చిన వాడు. దేశానికి స్వాతంత్ర్యం రావడంతో పాటే దేశం నిలువునా చీలింది. ఆ విభజన అనేక గాయాలు రేపింది. అప్పటిదాకా కలసి మెలసి ఉన్న వారే ఒకర్నొకరు అనుమాన దృష్టితో చూడడం మొదలు పెట్టారు. కత్తులు దూసుకున్న సందర్భాలూ ఉన్నాయి. దేశ విభజన హిందూ-ముస్లింల మధ్య అపారమైన విద్వేషాగ్ని రగిల్చింది. సరిహద్దుకు రెండు వేపులా రక్తం ఏరులై పారింది. మానవత గడ్డకట్టుకు పోయింది. ఈ ఘోరకలికి ప్రత్యక్ష సాక్షి ప్రసిద్ధ రచయిత భీష్మ సాహ్నీ (1915 ఆగస్టు 8 - 2003 జులై 11). వ్యక్తిగతంగా సౌమ్యుడు. మృదుభాషి. ఆలోచనా పరుడు. సాంస్కృతిక జీవితం లోతులు తెలిసినవాడు. స్వాతంత్ర్యానంతరం భీష్మ సాహ్నీ కుటుంబం పాకిస్తాను నుంచి ఇండియాకు వచ్చి స్థిరపడింది. లాహెూర్ ప్రభుత్వ కళాశాల నుంచి ఎం.ఎ. ఇంగ్లీషు పట్టా పొందారు. చండీగఢ్ లోని పంజాబ్ విశ్వవిద్యాలయంలో 1958లో పిహెచ్.డి. చేశారు. సాహ్నీది వ్యాపార కుటుంబం. తండ్రి ప్రోద్బలంతో కొంతకాలం వ్యాపారం చేసి చేతులు కాల్చుకున్నారు. ఆ తర్వాత అధ్యాపక వృత్తి చేపట్టారు.

మహాత్మా గాంధీ పిలుపునందుకుని 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. దేశ విభజన సమయంలో ఆయన కాంగ్రెస్ లో ఉన్నారు. రావల్పిండి కాంగ్రెస్ కార్యదర్శిగా ఉన్నారు. 1947లో రావల్పిండీలో శరణార్థుల సహాయ కార్యకలాపాలలో పాల్గొన్నారు. 1948లో భీష్మ సహానీ ప్రజానాట్య మండలి (ఇండియన్ పీపుల్స్ థియేటర్ - ఇప్టా) లో చేరారు. అప్పటికే ఆయన అన్న బల్ రాజ్ సాహ్ని ప్రజానాట్య మండలిలో చురుకైన కార్యకర్తగా ఉండే వారు. సోదరుడి సరసన నటనలో శిక్షణ పొంది అనేక నాటకాలలో నటించారు. నాటకాలకు దర్శకత్వం వహించారు. ప్రజా నాట్యమండలి ప్రదర్శించిన నాటకాలలో సాహ్నీ తన జీవిత భాగస్వామి షీల, కైఫీ ఆజ్మీ భార్య షౌకత్ ఆజ్మీతో కలిసి భూత్ గడి నాటకంలో నటించారు. ఈ నాటకానికి బల్ రాజ్ సాహ్ని దర్శకత్వం వహించే వారు. ప్రగతి శీల భావాలు వ్యాప్తి చేయడంలో, సాంస్కృతిక పునరుజ్జీవనంలో కీలక పాత్ర పోషించిన ప్రజానాట్యమండలిలో పని చేస్తున్న ప్పుడు బొంబాయిలో ఉన్న భీష్మ సాహ్నీ ఆ తర్వాత పంజాబ్ వెళ్లారు. కొంత కాలం అంబాలాలో, మరి కొంత కాలం అమృత్సర్ లోని ఖాల్సా కళాశాలలో లెక్చరర్‌గా పని చేశారు. ప్రజానాట్యమండలిలో పని చేస్తున్న కాలంలో ఆయన మార్క్సిజం వైపు ఆకర్షితుడై కమ్యూనిస్టు పార్టీలో చేరారు. కడదాకా సి.పి.ఐ.లోనే ఉన్నారు. బుద్ధి జీవిగానే ఆయన కమ్యూనిస్టు కారు, ఆచరణవాది. పంజాబ్ అధ్యాపక సంఘం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. 1952లో ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ కళాశాల (ప్రస్తుతం ఢిల్లీ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న జాకీర్ హుసేన్ కళాశాల)లో అధ్యాపకునిగా పని చేశారు. 1956లో మాస్కో వెళ్లి విదేశీ భాషల ప్రచురణాలయంలో 1963 దాకా టాల్ స్టాయ్ కథలు, రిసరక్షన్ నవలతో పాటు అనేక రష్యన్ రచనలను హిందీలోకి అనువదించారు. స్వదేశం తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ ఢిల్లీ కళాశాలలో అధ్యాపకునిగా కొనసాగారు. 1965 నుంచి 1967 దాకా సాహిత్య రంగంలో గౌరవస్థానం సంపాదించిన నయీ కహానీ పత్రికకు సంపాదకులుగా ఉన్నారు.

1975 నుంచి 1985 దాకా అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటులోనూ, నిర్వహణలోనూ ప్రధాన బాధ్యత నిర్వహించిన సజ్జాద్ జహీర్ తర్వాత భీష్మ సాహ్నీ అభ్యుదయ రచయితల సంఘానికి పెద్ద దిక్కయ్యారు. ఆఫ్రో ఆసియా రచయితల సంఘానికి కూడా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆ సంస్థ ప్రచురించే లోటస్ పత్రికకు సంపాదకుడిగా వ్యవహరించారు. భిన్న సంస్కృతుల మధ్య సమన్వయం సాధించడానికి ఏర్పాటు అయిన సహమత్ సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షునిగా ఉన్నారు. హత్యకు గురైన రంగస్థల నటుడు సఫ్దర్ హాష్మీ స్మృతిలో సహమత్ ఏర్పడింది. జీవితాంతం సాహ్నీ ఈ సంఘానికి అండగా ఉన్నారు.

వ్యాపారంలో వైఫల్యం, ప్రజానాట్యమండలితో అనుబంధం కారణంగా అనేక ప్రాంతాలలో పర్యటించడం వల్ల జన జీవితాన్ని పరిశీలించే అవకాశం రావడం, అనువాదకునిగా చేసిన కృషి, జీవితానురక్తి, సామాన్య ప్రజల హృదయ వేదనను అర్థం చేసుకోగలిగే ఔదార్యం సాహ్నీకి బోలెడు జీవితానుభవాన్ని సంతరించి పెట్టాయి. వ్యక్తిగానూ, రచయితగానూ భీష్మ సాహ్నీ స్వరం నిర్మలమైంది. హాస్య చతురుడు. సౌమ్యంగా కనిపించినా మూలుగలను తాకే వ్యంగ్యాస్త్రాలు విసరగల నేర్పు ఉన్న వాడు. గిలిగింతలు పెట్టే రీతిలో రాసి పేరు సంపాదించకుండా ఆలోచనలను రేకెత్తించే రచనలు చేసి ప్రసిద్ధుడైన వాడు సాహ్నీ. జీవితానుభవం సాహ్నీని ఉత్తమ రచయితగా దిద్ది తీర్చితే, రచయితగా ఆయన గడించిన అనుభవం జీవితాన్ని అర్థం చేసుకోవడానికి కావాల్సిన రచనలు చేయడానికి ఉపకరించింది. ఆయన కలం



ఎన్నడూ ఆగలేదు. అయినా ఆ కలం పాతబడలేదు. ప్రతి రచనా నవనవోన్మేషంగానే ఉండేది. నవలా రచయితగా, కథకుడిగా, నాటక రచయితగా ఏ ప్రక్రియ చేపట్టినా అన్నింటిలోనూ మేటి అనిపించుకున్నారు. విస్తారంగా రాయడమే కాక విస్తృతమైన పాఠకులను సంపాదించుకో గలిగారు. ఆయన రచనల గురించి సామాన్యులు కూడా చర్చించగలరు. 20వ శతాబ్ది హిందీ సాహిత్యకారులలో భీష్మ సాహ్నీది చెరగని సంతకం. ప్రేమ్ చంద్, హరిశంకర్ పర్సాయ్ కి ఉన్న పాఠకాదరణ ఆధునిక సాహిత్యకారుల్లో భీష్మ సాహ్నీకి మాత్రమే ఉంది.

తమస్ నవల సాహ్నీ రచనల్లోకెల్లా ఎక్కువ జనాదరణ పొందింది. దేశ విభజన మిగిల్చిన గాయాలను ఆయన ఈ నవలలో చిత్రించారు. దేశ విభజన జరిగి మూడు దశాబ్దాలు గడిచిన తర్వాత తన ప్రత్యక్ష అనుభవాలను సాహ్నీ తమస్ నవలగా మలిచారు. దేశ విభజన రేపిన గాయాల ఆధారంగా హిందీ, ఉర్దూలో అపారమైన సాహిత్యం వచ్చింది. అందులో సాహ్నీ తమస్ నవల సుస్థిర స్థానం సంపాదించుకుంది. ఈ నవలతో పాటు ఇదే ఇతివృత్తంపై సాహ్నీ రాసిన మరో రెండు కథల ఆధారంగా గోవింద్ నిహ్లానీ తమస్ ఫిల్మ్ గా చిత్రీకరించారు. ఇది 1988లో దూరదర్శన్ లో ధారావాహికగా ప్రసారమైంది. దీనికి జనాదరణ ఎంత ఉందో హిందూ మతోన్మాదుల వ్యతిరేకత కూడా అంతే ఉంది. సాంస్కృతిక పోలీసు బాధ్యతను నెత్తిన వేసుకునే మతోన్మాదులు ఈ ప్రసారాన్ని అడ్డుకోవడానికి చేయని ఆగడం లేదు.

మతోన్మాదులు అన్ని మతాల్లోనూ ఉంటారని, వారు రాజకీయ ప్రయోజనాలకోసం మతాన్ని దుర్వినియోగం చేసి సమస్యలు సృష్టిస్తారని సాహ్నీ ఈ నవలలో తేల్చి చెప్పారు. దేశ విభజన మానవ జాతి చరిత్రలో విషాద ఘట్టం అని చెప్పడానికే సాహ్నీ ఈ నవల రాశారు. ఈ నవల ఇంగ్లీషు, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషలతో పాటు తమిళం, తెలుగు, గుజరాతీ, మలయాళం, కశ్మీరీ, మణిపురి భాషల్లో కూడా వెలువడింది. హిందీ సాహిత్యానికి పాఠకుల కొరత ఉంది అన్న సాహిత్యకారుల, ప్రచురణ కర్తల వాదనను భీష్మ సాహ్నీ రచనలన్నీ పరాస్తం చేశాయి. ఆయన సాహిత్యంలో ప్రధానపాత్రధారులు ధీరోదాత్తులు కారు. అతి సామాన్యులు. కాని ఆ అతి సామాన్యులనే ధీరోదాత్తులుగా నిలబెట్టారు సాహ్నీ. వామపక్ష ఉద్యమంతో సాహ్నీకి సన్నిహిత సంబంధం ఉండడమే కాక అందులో భాగస్వామి అయినందువల్ల, మార్క్సిస్టు భావజాలం సత్యాన్వేషణలో కాగడాగా ఉపకరించినందువల్ల ఆయన రచనలన్నీ ఉత్తమ సాహిత్య సంప్రదాయాన్ని ప్రోది చేశాయి. ఉదాత్త సాహిత్య వారసత్వాన్ని మిగిల్చాయి.

విచిత్రం ఏమిటంటే 69వ ఏట భీష్మ సాహ్నీ సినిమాల్లో నటించారు. 1984లో సయీద్ అఖ్తర్ మిర్జా దర్శకత్వం వహించిన మోహన్ జోషి హాజిర్ హెూ సినిమాలో సాహ్నీ నటించారు. గోవింద్ నిహ్లాని దర్శకత్వం వహించిన తమస్ టీవీ చిత్రంలో కూడా సాహ్నీ నటించారు. ఆయన నటించిన ఆఖరి సినిమా మిస్టర్ అండ్ మిసెస్ అయ్యర్ (2002). తమస్ కాక మరో ఆరు నవలలు, పది కథా సంపుటాలు, అయిదు నాటకాలు సాహ్నీ వెలువరించారు. బాలల కోసం కథలు రాశారు. ఆయన మొదటి రచన భాగ్య రేఖ 1953లో వెలువడితే ఆఖరి రచన ఆజ్ కే అతీత్ (ఆత్మ కథ) జీవిత చరమాంకంలో రాశారు. సాహిత్య అకాడమీ అవార్డు, సంగీత నాటక అకాడమీ అవార్డు, సాహిత్య అకాడమీ ఫెలోషిప్, సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు, పద్మశ్రీ, పద్మ భూషణ్ సత్కారాలు సాహ్నీకి దక్కాయి. ఆయన సాహిత్యం ఎంత పరిపూర్ణమైందో జీవితమూ అంతే నిండైంది.

-ఆర్వీ రామారావ్

నాటు కవిత్వం

నేను నేటికవిత్వాన్ని నాటుకవిత్వాన్ని
తెలుగు కవిత్వాన్ని తేనెలొలుకు కవిత్వాన్ని
తెలంగాణ కవిత్వాన్ని తెలుగుజాన కవిత్వాన్ని
వెన్నెల గీతాన్నై వన్నెల తరంగాన్నై
వాణీవీణా నాదాన్నై శివతాండవ గీతాన్నై
విశ్వసినీ వినీలాకాశంలో విజయకేతనాన్నై
ఇంద్రజాల కేళీలో చంద్రబోసు పాళీనై
తన్మయత్వాలు సృజించిన తత్వజ్ఞులను మురిపించిన
ఈనాటి కవిత్వాన్ని నాటుకవిత్వాన్ని

అనుభూతుల కవిత్వాన్ని ఆరారార్ కళాతత్వాన్ని
నా వేదన ఆవేదన ఆక్రందన ఆరాటం
అన్యభాషలను మించగ అంతులేని పోరాటం
వేదమంత్రసారాన్నై వెట్టిరగిలె తంత్రాన్నై
కలవరింతలు పెట్టించాను పులకరింతలు దట్టించాను
జక్కన్న చూపుడు వేలును పట్టి కీరవాణి యెదపాదలో పుట్టి
రామద్వయం కరచరణాలల్లో కదలికలలొ కలగలిసిన
సెలయేటి ఊటవంటి ఎలతేటి పాటలాంటి
మేటి కవిత్వాన్ని వెలిగిన నాటు కవిత్వాన్ని

తెలుగుదనం తెలివిఘనం కలగలిసిన నాదాన్నై
తెలుగు తేజమలరించగ తిరుగులేని విజయాన్నై
పల్లవించి పరిఢవించి స్వరజల్లుగ హరివిల్లుగ
సాక్ష్యాన్నై కల్పవృక్షాన్నై
విశ్వవీణనై విపంచినై
శాస్త్రాన్నై చిత్రాన్నై భాష్యాన్నై చిన్మయ రూపాన్నై
విలయతాండవాల జడిలో విశ్వశాంతి సృజియించిన
సత్తువతో చాటించగ బోధి సత్వాలను బోధించిన
అంతర్జాతీయ స్థాయి యవనికపై నిలిచి గెలిచి
ఆస్కారవార్డు వలచి అందుకొన్న నాటు కవిత్వాన్ని.

- డా.పల్లేరు వీరాస్వామి.
94416 02605

విశ్వ రహస్య జీవులు

అదిగో విడిచిన చెప్పులు ఎవరో దీనులు
ఎక్కడికి వెళ్లారో ఎక్కడి నుండి వచ్చి
బహుదూరపు బాటసారులు గామోసు
ఏ ఆకాశ గంగకో ప్రయాణం కాబోలు
విశ్వ రహస్యాలను కనుగొనుటకు
ఏమీ పరికరాలు లేవు ఉండవు
బాటలో దొరికినవి తప్ప
ఒక మెదడు తప్ప ఖాళీ చేతులు తప్ప
గాఢ నిద్ర తీస్తారు చేయి తలకు ఆంచి
సృష్టికర్తలాగా కలగంటారు ఎప్పుడూ
నిరంతరం అందులోనే ఉంటారు గనుక
ప్రతి శ్వాసలో అదే ఉత్సుకత
అక్కణ్ణించే ఎక్కడెక్కడో సంచరిస్తూ
వేటినో తాకుతూ
కొన్ని అమరికలు పొందుపరుస్తూ కూరుస్తూ
చేసినదే చేస్తూ పదేపదే అలవక
కూలుతున్న వాటిని ఎత్తుతూ మళ్ళీ మళ్ళీ
నిలబెడుతూ చక్కబెడుతూ సరిచూస్తూ
ఆటా పాటా వ్యాపకం అదే అన్నీనూ
వింటారు కొన్నిసార్లు సంగీతాల్ని చెవులు రిక్కించి
లేదా దూరంగా పోతారు అటువైపు
ఎవరూ లేని వైపు
ముసిముసి నవ్వులు తప్ప
పరధ్యానంగా వచ్చినవే అవి
కొన్ని కొమ్మలు తెంపుకొని
ఆకులు జేబులో వేసుకుని
కొన్ని ఆకారాలను
పుస్తకాల పేజీల మధ్య ఉంచుకొని
కాలం పయ్యపై మర్చిపోతూ నడుస్తుంటారు
వదులు వదులుగా ఉండే వస్త్రాలు చుట్టుకొని
చూస్తుంటారు వెన్నెల రాత్రులని
పాలపుంతల సమూహాల్ని
ఏ గెలాక్సీకి చెందిన వారమని
ప్రశ్నించుకోరు తమను
ఏదీ వాళ్ళది కాదు ఏమీ వాళ్ళకు చెందదు
వాళ్ళూ దేనికి చెందరు ఏవీ ఆపాదించబడవు
ఉంటారు ఉండీ ఉండనట్టు అంతే
ఉంటున్నట్టు తెలియదు కూడా ఒక్కోసారి
శూన్యం విశాలవదనంపై కదులుతూ చిరంజీవులై..

రఘు వగ్గు, 9603245215

శ్రీ శ్రీ జయంతి సందర్భంగా కవితల పోటీ

నంద్యాల జిల్లా అభ్యుదయ రచయితలసంఘం (అరసం)ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాస్థాయి కవితలపోటీకి అ.ర.సం. నంద్యాల శాఖ ఆహ్వానం పలుకుతోందని కన్వీనర్ ముర్తుజా తెలిపారు. 'ప్రస్తుత సమాజం- తీరుతెన్నులు' ను దృష్టిలో పెట్టుకుని అభ్యుదయ రచనలను ఆహ్వానిస్తున్నట్టు నంద్యాలజిల్లా అరసం జిల్లాకన్వీనర్ తెలిపారు. ప్రేమకవితలు, అశ్లీలతలకు తావు లేదని అభ్యుదయ కవితలను మాత్రమే రెండేసి కాపీలను ప్రతిరచయిత పోటీకి పంపవలసి ఉంటుందన్నారు. రచనలు ఏప్రిల్ 20వతేదీలోగా యస్.ముర్తుజా, రచయిత, అరసం నంద్యాల జిల్లా కన్వీనర్, ఎస్.వి.గ్రీన్ అవెన్యూ అపార్ట్మెంట్స్, ఫ్లాట్ నెంబర్: 117, బ్లాక్-ఎ2, జొహరాపురం రోడ్డు, కర్నూలు జిల్లా అనే చిరునామాకు పంపించాలన్నారు. హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలని, హామీపత్రం పైన మాత్రమే రచయిత పేరు, చిరునామా ఉండాలన్నారు. ఐదుగురు ఉత్తమ రచయితలకు ఏప్రిల్ 30, 2023 శ్రీ శ్రీ జయంతి నాడు సత్కారం ఉంటుందని విజేతల పేర్లు ఆరోజే ప్రకటింపబడతాయని రచయితలందరూ ఆనాడు హాజరై తమరచనలను వేదికపై చదివి వినిపించవలసి ఉంటుందన్నారు. వివరాలకు 9182494 360 నంబర్లో సంప్రదించాలని కోరారు.

– ముర్తుజా యస్, నంద్యాల జిల్లా అ.ర.సం. కన్వీనర్, నంద్యాల.

డాక్టర్ వి.చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం-2023

ఏప్రిల్ 16, 2023 ఆదివారం ఉదయం 10.30 గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్ నందు డాక్టర్ వి.చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం-2023ను యువ కథకుడు వి.మల్లికార్జున్‌కు ప్రదానం చేస్తారు. వాసిరెడ్డి నవీన్ అధ్యక్షత వహించే ఈ సభలో కె.శివారెడ్డి, వి.ప్రసూన, కాట్రగడ్డ దయానంద్, ఎ.కె.ప్రభాకర్,అపర్ణ తోట పాల్గొంటారు.

డాక్టర్ వి. ప్రసూన, డాక్టర్ వి.చంద్రశేఖరరావు సాహిత్య కుటుంబం

తెలంగాణ సాహిత్య అస్తిత్వ జల 'పలుకు జెలి'

గ్రంథ సమీక్ష

నిత్య సాహితీ పరిశోధకుడుగా అనేక పుస్తకాలను రాసి, మరెన్నో సాహితీ గ్రంథాలకు సంపాదకత్వం వహించి శ్రీలేఖ సాహితి ద్వారా ప్రచురించి, ఉత్తమ సాహిత్య వ్యాప్తికి కృషి చేస్తున్న డా.టి. శ్రీరంగస్వామి రాసిన తెలంగాణ సాహిత్య అస్తిత్వ అంశాల జల 'పలుకు జెలి' వ్యాససంపుటి. ఇందులో మొత్తం 16 వ్యాసాలున్నాయి. ఇవి వేటికవే ప్రత్యేకతను సంతరించుకున్నాయి. తెలంగాణ స్వాతంత్రోద్యమ సాహిత్యం, హనుమకొండ జిల్లాలో జాతీయ స్వాతంత్రోద్యమం అనే రెండు వ్యాసాల్లో తెలంగాణాలో సాహిత్యమే లేదన్న వాదనను తోసిపుచ్చుతూ సోదాహరణంగా చక్కనివివరణ చేశారు. బ్రిటీషిండియాలో సాగిన స్వాతంత్ర్యోద్యమ స్వరూపం వేరని, నిజాం రాష్ట్రంలో సాగిన పోరాట స్వరూపం వేరని, దానికనుగుణంగానే సాహిత్యంకూడా వచ్చిందని అంటారు. నిజాం వ్యతిరేక పోరాటం జాతీయ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగానే వచ్చిందని, గ్రంథాలయోద్యమం ద్వారా తెలుగు భాష,సాహిత్య విస్తృతికి ఆనాటి కవులు, గ్రంథాలయోద్యమ నాయకులు చేసిన కృషిని విశ్లేషించారు. గ్రంథాలయోద్యమంలో కొమర్రాజు లక్ష్మణ రావు, మాడపాటి హనుమంతరావులతో పాటు అనేకమంది చేసిన కృషిని ఇందులో విపులీకరించారు. అదే విధంగా సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి, కాళోజీ, దాశరథి రంగా చార్యులు, వట్టికోట ఆళ్వారు స్వామి, కాంచనపల్లి చినవెంకట రామారావు, నెల్లూరి కేశవస్వామి, భాగి నారాయణ మూర్తి, దేవులపల్లి రామానుజ రావు లాంటి అనేక మంది జాతీయోద్యమ,స్వాతంత్ర్యోద్యమ సాహిత్యం సృజించారని వారి వారి సాహితీ కృషిని ఇందులో సోదాహరణంగా వివరించారు.

పోతన రాసిన భాగవతానికే నాంది నారాయణ శతకమని, ఆ శతకంలో భాగవత బీజాలున్నాయని అది పోతన రాసిందేనని అంటారు. ఒక పాలకుని ఆత్మఘోష అనే వ్యాసంలో అప్పటి నైజాం చివరి ప్రధాని మీర్ లాయఖలీ ఏట్రాజడీ ఆఫ్ హైదరాబాద్ పేర నిజాం పాలన అంతిమ దశకు మదనపడుతూ తన బాధను రాశాడని, దానిని ఏనుగు నరసింహారెడ్డి హైద్రాబాద్ విషాదం పేరుతో అనువదించిన తీరును ప్రశంసించారు. అందులో నిజాం రాష్ట్రం భారత్‌లో విలీనమైనపుడు లాయక్ అలి పడిన ఆత్మఘోషను శ్రీరంగస్వామి వివరిస్తూ 17, 18 శతాబ్దాలలోనే హైద్రాబాద్ నిజాం రాష్ట్రం నిజాం రైల్వేస్, నిజాం తంతి తపాలా, ఆకాశవాణి, రవాణా, దక్కన్ ఏర్ లైన్స్, లాంటి విశిష్ట వ్యవస్థలను కలిగి ఉందని, ఒక నౌకాశ్రయం కూడా ఉండేదని, దీనిని ఆంగ్లేయులకు భరణంగా ఇచ్చారని వివరించారు.

ఆరుద్ర రాసిన సమగ్రాంధ్ర సాహిత్యచరిత్రలో కాని, మధునాపంతుల ఆంధ్ర కవి తరంగిణిలో కాని తెలంగాణ సాహిత్య చరిత్రపై చిన్న చూపు చూశారని, ప్రాంతీయ వివక్షతో రాశారని అంటారు. అందుకే సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ కవుల సంచిక, మొదలుకొని ఇప్పుడు అనేకమంది తెలంగాణ వాస్తవ సాహిత్య చరిత్రను తెలంగాణ దృక్కోణం నుండి రాస్తున్నారని ఆయా రచయితలు చేస్తున్న కృషిని తొలి తెలంగాణ సాహిత్య కరదీపిక అనే వ్యాసంలో విశ్లేషించారు.

1970-95 వరకు 25 సంవత్సరాల కాలంలో వచ్చిన తెలంగాణ శతక సాహిత్యంపై పరిశోధన చేసిన డా. పల్లేరు వీరస్వామి అనేకమంది శతక కవులను వెలుగులోకి తెచ్చిన తీరును, తెలంగాణ శతక సాహిత్యం పల్లేరు పరిశోధనలు అనే వ్యాసంలో వివరించారు. సమగ్ర శతక లక్షణాలు కలిగిన పాల్కురికి సోమనాథుని వృషాధిప శతకంతో శతక ప్రక్రియ తెలంగాణ అనే పుట్టిందని అంటారు. అదే విధంగా ఉత్తర తెలంగాణలో వెలువడిన కథలపై ఉత్తర తెలంగాణ కథలు పేరున డా.ఆకునూరి విద్యాదేవి పరిశోధనలోని కథలను, వాటి ప్రాశస్త్యాన్ని ఉత్తర తెలంగాణ కథలు, సమగ్ర పరిశీలన అనే వ్యాసంలో చాటిచెప్పారు. తెలుగ కథా సాహిత్యంలో మొట్టమొదటి కథా రచయిత్రి బండారు అచ్చమాంబ అని, మొదటి తెలంగాణ కథా రచయిత మాడపాటి హనుమంతరావు అని విద్యాదేవి తన పరిశోధనలో తేల్చి చెప్పారని వివరించారు.



పలుకు జెలి.(సాహిత్య విమర్శ వ్యాసాలు)
రచన : డా.టి.శ్రీరంగస్వామి
వెల: రు.100/-, పేజీలు: 104
ప్రచురణ: శ్రీలేఖ సాహితి, వరంగల్లు.
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌజ్ అన్ని బ్రాంచీలు.
మరియు, శ్రీలేఖ సాహితి సాంస్కృతిక సమాఖ్య,
27-14-53,మండల కార్యాలయం
ఎదురుగ, హసన్ పర్తి, వరంగల్లు-506371.

మనకాలపు తెలంగాణ యోగి వరకవి భూమాగౌడ్ అనే వ్యాసంలో ఒక సాధారణ వ్యక్తి కవిగా, యోగిగా ఎలా పరిణామం చెంది విశిష్టాద్వైత భక్తి తత్వాన్ని బోధించారో ఆయన జీవిత విశేషాలను, కవిత్వాన్ని విశదీకరించారు.

పత్రికా నీలమణి మాడభూషి శ్రీనివాసచార్య అనే వ్యాసంలో, శ్రీనివాసచార్య వరంగల్‌లో జనధర్మ పత్రిక స్థాపించి దాని ద్వారా నిజాం ప్రభుత్వ వ్యతిరేకోద్యమ చైతన్యం రగిలించిన తీరు, సాహిత్య వ్యాప్తికి చేసిన కృషిని వివరించారు. ఇంకా ఈ వ్యాస సంపుటిలో భర్తృహరి వైరాగ్యశతి అమ్మంగి వేణుగోపాల్ వ్యాసాలు, తొలి మహిళా పదకోశకర్త ముదిగంటి సుజాత రెడ్డి, అమృత ఏకాంత గానం, నిశ్శబ్ద యోధ, నిత్య సాహితీ వసంతుడు తదితర వ్యాసాలు అనేక ప్రామాణికమైన కొత్తవిషయాలతో వేటికవే ప్రత్యేకతను చాటుకున్నాయి. తెలంగాణ సాహిత్యంపై పరిశోధన చేయాలనుకునే వారికి చక్కని దారి దీపం ఇది.

- వేల్పుల నారాయణ, 9440433475

ప్రపంచ నేత్రం రాహుల్ సాంకృత్యాయన్

'ఓ నరుడా వెళ్ళు విశాల విశ్వమంతా పయనించు. దానికై నీకింకొక జీవితం లభ్యం కాదు. నీవెంత సుదీర్ఘకాలం జీవించినా నీ యవ్వనం తిరిగిరాదు. అంచేత అనంత విశ్వాంతరాళలో నిరంతరం పథికుడిగా సాధ్యమైనంత విజ్ఞానాన్ని సొంతం చేసుకో' అనే లక్ష్యంతో మహాపండిట్, పర్యాటక సాహితీ పితామహుడు, పద్మభూషణ్ రాహుల్ సాంకృత్యాయన్ ప్రజలను జాగృత పరిచారు. దేశవిదేశాల్లో సుదీర్ఘ యాత్రా పర్యటనలు జరిపారు. ఆ యాత్రల వల్ల అనంతమైన అనుభవాలను, విజ్ఞానాన్ని పొందారు. ఇలా గ్రహించిన విజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు అనేక గ్రంథాలను రాశారు. 18భాషల్లో పరిజ్ఞానం సంపాదించాడు. మొత్తం నలభై అయిదేళ్ళకు పైగా యాత్రలు చేసి చరిత్ర సృష్టించారు. ప్రాచీన మత గ్రంథాలను పరిశీలించి అందులో ఉన్న ఛాందస భావాలపై తిరుగు బాటు బావుటా ఎగరేశాడు. మూఢాచారాలను తీవ్రంగా ఖండించాడు. సమతా భావమే ధ్యేయంగా భావించి మార్క్సిజాన్ని స్వీకరించాడు. మానవ కళ్యాణానికి మార్క్సిజమే శరణ్యమని విశ్వసించాడు. 'మహాపండిట్' బిరుదును పొందిన సాంకృత్యాయన్ అసలు పేరు కేదార్‌నాథ్ పాండే. ఈయన 1893 ఏప్రిల్9న ఉత్తరప్రదేశ్ లోని అలంఘర్ జిల్లా పందహ అనే పల్లెలో జన్మించారు.

ఆయనకు ప్రపంచాన్ని చూడాలన్న కోరికతో ముందుగా కలకత్తా వెళ్ళాడు. అక్కడ బెంగాలీ భాషలో పోస్టర్లను చూసి ప్రభావితుడై ఆ భాషను నేర్చుకున్నాడు. ఆ పిమ్మట ఆయన ప్రయాగ, గంగోత్రి, కేదారనాథ్ తదితర ప్రాంతాలను పర్యటించాడు. అక్కడ సంస్కృతం నేర్చుకున్నాడు. నేపాల్, టిబెట్, శ్రీలంక దేశాలను పర్యటించాడు. అక్కడ అమూల్యమైన బౌద్ధ గ్రంథాలను సేకరించి, పరిశోధనలు జరిపాడు. వీటిపై అనేక గ్రంథాలను రాశాడు. ఇంగ్లండు, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, కొరియా, మంచూరియా తదితర దేశాలను పర్యటించాడు.

1922లో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నందుకు ఛప్రాలో అరెస్టయ్యారు. ఫలితంగా ఏడు నెలలపాటు జైలు శిక్షను అనుభవించారు. కమ్యూనిస్టు నాయకునిగా రైతు మహాసభలను, ఉద్యమాలను నిర్వహించడం వల్ల జైలు శిక్షకు గురయ్యాడు. 1931లో రెండోసారి సింహళం వెళ్లేముందు మార్క్స్, ఎంగెల్స్‌ల కమ్యూనిస్టు ప్రణాళికను హిందీలోకి అనువదించాడు. 1935లో పూర్తి కాల కమ్యూనిస్టుగా మారాడు. 1937-38,1947-48సంవత్సరాలలో రష్యాలోని లెనిన్ గ్రాడ్ విశ్వ విద్యాలయంలో సంస్కృత ప్రొఫెసర్‌గా పనిచేశారు. చైనాలో నాలుగు నెలల పాటు పర్యటించినప్పుడు అక్కడి విశేషాలపై రెండు పుస్తకాలు రాశారు. తన పర్యాటక అనుభవాల గురించి పూసగుచ్చినట్టుగా హిందీ, సంస్కృతం, భోజ్‌పురి, పాళీ, టిబెటన్ భాషల్లో రచించారు.

ఉర్దూ, పర్షియన్, అరబిక్, తమిళం, కన్నడ, ఫ్రెంచ్, రష్యన్ భాషల్లో కూడా ప్రావీణ్యం ఉన్న రాహుల్ తన ఇరవైవ ఏట నుంచి రచనలు చేయడం మొదలు పెట్టాడు. ఒక పక్క యాత్రలను జరుపుతూ మరో పక్క 150 గ్రంథాలను రాశారు. వీటిలో మేరా జీవన్ యాత్ర(5సంపుటులు), మానవ సమాజ్, వైజ్ఞానిక భౌతిక వాద్, సింహసేనాపతి, వోల్గాసే గంగా తక్ ముఖ్యమైనవి. వీటితో పాటు చరిత్ర, జానపదం, నిఘంటువులు తదితర అంశాలను సైతం స్పృశించారు. 1958లో 'మధ్య ఆసియాకా ఇతిహాస్' గ్రంథానికి సాహిత్య అకాడమీ అవార్డు, 1963లో పద్మభూషణ్ పురస్కారం ఆయనకు లభించింది. అనారోగ్యానికి గురై మెరుగైన చికిత్స కోసం రష్యా వెళ్లాడు. తిరిగి స్వదేశానికి వచ్చిన తరువాత 1963 ఏప్రిల్ 14న తనువు చాలించాడు. దేశం ఒక బహుముఖ ప్రజ్ఞాశాలిని, గొప్ప యాత్రా పరిశోధకుడ్ని, విశేష రచయితను కోల్పోయింది.

- వాండ్రంగి కొండలరావు,
సీనియర్ పాత్రికేయుడు, సెల్ 94905 28730

పెరుగుతున్న కరోనా ముప్పు

- మూడు రాష్ట్రాల్లో మాస్కులు తప్పనిసరి
- నేడు, రేపు దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్

న్యూఢిల్లీ: గతకొన్ని రోజులుగా దేశంలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతూ ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. కరోనా నిబంధనలు పాటించాలని అనేక రాష్ట్రాలు ప్రజలకు సూచిస్తున్నాయి. మరికొన్ని రాష్ట్రాల్లో అంతర్జాతీయ ప్రయాణికులకు విమానాశ్రయాల్లోనే కరోనా పరీక్షలు తప్పనిసరి చేశాయి. తాజాగా మూడు రాష్ట్రాలు మాస్కులు తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీచేశాయి. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు తప్పనిసరిగా ధరించాలని హరియాణా, కేరళ, పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వాలు సూచించాయి. కరోనా నాలుగో వేవ్‌పై కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీచేస్తోంది. సోమ, మంగళవారాల్లో దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ నిర్వహించనుంది. తద్వారా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కరోనా సన్నద్ధతను పరిశీలించనున్నారు. కోవిడ్ మ్యూటేషన్ ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ అయిన బీఎఫ్.7, ప్రస్తుతం ఎక్స్‌బీబీ1.16 సబ్ వేరియంట్ కారణంగా కరోనా కేసులు పెరుగుతున్నాయని ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఈ సబ్‌వేరియంట్లతో పెద్దగా ప్రమాదం లేకపోయినా కేసులు వేగంగా పెరగడానికి దోహదపడుతున్నాయని అధికారులు చెపుతున్నారు. ఇక కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతుండటంతో హరియాణా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. ముందుజాగ్రత్త చర్యగా బహిరంగ ప్రదేశాల్లో మాస్కు ధరించాలని స్పష్టం చేసింది. కోవిడ్ ప్రొటోకాల్‌ను పాటించాలని కోరింది. కేరళ ప్రభుత్వం గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు మాస్కులు తప్పనిసరిగా ధరించాలని సూచించింది. బహిరంగ ప్రదేశాల్లో మాస్క్ ధరించడాన్ని కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఆసుపత్రులు, హోటళ్లు, రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సంస్థల్లో పనిచేసే సిబ్బంది కూడా మాస్కులు ధరించాలని ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రయాణికులకు కరోనా పరీక్షలు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కరోనా పాజిటివ్‌గా తేలితే ఆ నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపాలని సూచించింది.

కొత్తగా 5,357 కేసులు

దేశంలో ఆదివారం ఉదయం 8 గంటలతో ముగిసిన 24 గంటల వ్యవధిలో 5,357 కరోనా కేసులు కొత్తగా నమోదయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 32,814కి పెరిగింది. కొత్తగా మరో 11 మంది మహమ్మారి వల్ల మరణించారు. దీంతో ఇప్పటి వరకు కరోనాతో మృతిచెందిన వారి సంఖ్య 5,30,965కు చేరింది.

ఆ మాత్రాన చరిత్ర మారిపోదు

పాఠ్యాంశాల తొలగింపుపై ఫరూఖ్ అబ్దుల్లా

కశ్మీర్: నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్సీఈఆర్టీ) చేపడుతున్న పాఠ్యాంశాల సవరణ తీవ్ర వివాదాస్పదమౌతున్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చరిత్రను వక్రీకరించేందుకు, వాస్తవాలను మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠ్యాంశాల తొలగింపుపై మేధావి వర్గం తీవ్రంగా తప్పుపట్టింది. ఎన్సీఈఆర్టీ నిర్ణయం వెనుక విభజన ఉద్దేశం స్పష్టమవుతుందని, ఇది మన రాజ్యాంగ ధర్మానికి, భారత ఉపఖండ సమ్మిళిత సంస్కృతికి వ్యతిరేకమని వారు విమర్శించారు. తాజాగా ఈ జాబితాలో జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా చేరారు. పుస్తకాల నుంచి పాఠ్యాంశాలను తొలగిస్తే చరిత్ర మారిపోదని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎన్సీఈఆర్టీ పుస్తకాల నుంచి మొఘల్స్ చాప్టర్‌ను తీసేసినంత మాత్రాన చరిత్రను మార్చలేరు. తాజ్‌మహల్, ఎర్రకోట, ఇతర చారిత్రక కట్టడాలు మన ముందే ఉన్నాయి" అని అబ్దుల్లా అన్నారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లోని 11 ప్రాంతాల పేర్లను చైనా మార్చడాన్ని ఆయన ప్రస్తావించారు. ఇలా జరగడం ఇదే మొదటిసారికాదు. చాలా కాలం నుంచి అరుణాచల్ తమదని బీజింగ్ అంటున్నది. కానీ భారత్ దానిని అంగీకరించడానికి సిద్ధంగా లేదు. ఆ 11 ప్రాంతాలను చైనా దక్షిణ టిబెట్‌గా పిలుస్తున్నది. గత దశాబ్ద కాలంలో ఢిల్లీ, బీజింగ్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సరిగాలేవడానికి ఇదే నిదర్శనమని ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు.

కర్నాటకలో ఫిరాయింపుల జోరు

మా పార్టీలోకి 15 మంది వస్తారు: కుమారస్వామి

బెంగళూరు: వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో రాజకీయం వేడెక్కుతోంది. నాయకుల పార్టీ ఫిరాయింపు జోరుగా సాగుతోంది. ఇప్పటికే అనేక మంది బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాజకీయ పార్టీలు ఒకదానిపై ఒకటి విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నాయి. జనతాదళ్ (సెక్యులర్)-జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సుమారు 15 మంది కాంగ్రెస్ నేతలు తమ పార్టీలో చేరుతారని చెప్పారు. శాసన మండలి మాజీ సభ్యుడు రఘు ఆచార్ ఇప్పటికే తనతో మాట్లాడారని, జేడీఎస్‌లో చేరతానని స్వయంగా చెప్పారని తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు చెందిన 15 మంది నేతలు జేడీఎస్‌లో చేరుతారన్నారు. 'గతంలో జేడీఎస్‌ను ముంచేందుకు ఎమ్మెల్యేలను కాంగ్రెస్ తీసుకెళ్లింది. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి జేడీఎస్‌లోకి వస్తున్నారు' అని అన్నారు. జేడీఎస్ అభ్యర్థుల రెండో జాబితాను సోమవారం విడుదల చేస్తామని కుమారస్వామి తెలిపారు. మాజీ ఎంపీ, బహిష్కృత జనతాదళ్ (సెక్యులర్) నాయకుడు ఎల్ఆర్ శివరామ్ బుధవారం బీజేపీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, జేడీఎస్‌లో అంతర్గత రాజకీయాలు, ఘర్షణలు ఎక్కువన్నారు. సూచనలను బహిరంగంగా వ్యక్తీకరించే హక్కు కూడా ఉండదని అన్నారు. అందుకే యువజన కాంగ్రెస్ నాయకుడు అయిన తాను తొలుత కాంగ్రెస్‌ను, తర్వాత జేడీఎస్‌ను వీడి బీజేపీలో చేరినట్లు చెప్పారు. రాబోయే 10 రోజుల్లో ఇంకా చాలా మంది నాయకులు బీజేపీలో చేరుతారని తెలిపారు. రాష్ట్రంలో మెజారిటీ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు.

పని ప్రభుత్వానిది... ఘనత మీదా

లెఫ్టినెంట్ గవర్నర్ తీరుపై ఢిల్లీ మంత్రి భరద్వాజ్ అసహనం

న్యూఢిల్లీ: యమునా నది ప్రక్షాళన కోసం ఢిల్లీ ప్రభుత్వం కష్టపడితే అదేదో తానే చేసినట్లుగా లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా వ్యవహరించారని ఢిల్లీ మంత్రి సౌరభ్ భరత్వాజ్ ఆరోపించారు.పని చేసేదేమో ఢిల్లీ ప్రభుత్వం... ఘనత మాత్రం లెఫ్టినెంట్ గవర్నర్‌కా అంటూ అసహనం వ్యక్తంచేశారు. సక్సేనా ఆదివారం వజీరాబాద్‌లోని సప్లిమెంటరీ కాలువను సందర్శించి 'పేరు కోసం కాదు.. ప్రజలకు స్వచ్ఛ యమునా అందించేందుకు పని చేస్తున్నాం' అని చెప్పుకున్నారు. ఈ వ్యాఖ్యలను భరద్వాజ్ తప్పుపట్టారు. ఢిల్లీ ప్రభుత్వం నది ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటుంటే అదేదో తాను చేసినట్లు సక్సేనా చెప్పుకుంటున్నారని, ఇటువంటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించే రాజ్యాంగబద్ధ అధికారం ఆయనకు లేదని, కేవలం ఢిల్లీ ప్రభుత్వమే చేయగలదన్నారు. యమునా ప్రక్షాళన కోసం ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాల జాబితాను

మీడియాతో పంచుకున్నారు. 'ఆయన పని కాలువలను సందర్శించడం కాదు. ఆయన తన పరిధిలోని పోలీసు స్టేషన్లకు వెళ్లారు. ఢిల్లీలో 350 పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఆయన వాటిని సందర్శించాలి. కానీ కాలువల వద్దకు వెళ్లి అక్కడ జరుగుతున్న పనికి ఘనత పొందాలని చూడటం తగదు' అని విలేకరులతో మాట్లాడిన భరద్వాజ్ అన్నారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ అంశాన్ని ఎప్పుడు ప్రస్తావించలేదుగానీ ఇది జరుగుతోందని ఆయన చెప్పారు.

నకిలీ వార్తలను గుర్తించడంలో

నిబంధనల మార్పునకు సంప్రదింపులు

కేంద్ర న్యాయ మంత్రి కిరెన్ రిజిజు

బద్గామ్ (జమ్ముకశ్మీర్): నకిలీ వార్తలు, తప్పుడు సమాచారాన్ని గుర్తించే నిబంధనలకు సవరణలు సంప్రదింపుల ప్రక్రియ ద్వారా చేశామని, అయితే అమలు చేయడానికి ముందు చాలా చర్చలు అవసరమని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరెన్ రిజిజు ఆదివారం అన్నారు. 'మొత్తం ఎన్నికల ప్రక్రియలో కొన్ని సవరణలు చేయడానికి మేము చూస్తున్నాము. ఇది సంప్రదింపుల ప్రక్రియ జరుగుతున్నందున నేను ఎటువంటి నిబద్ధత ఇవ్వలేను. అందువల్ల ఫేక్ న్యూస్ నిర్వచనం, నకిలీ వార్తలు, తప్పుడు సమాచారం ... ఇవన్నీ చాలా చర్చలు అవసరమయ్యే ముఖ్యమైన విషయాలు. మేం చేస్తున్నాం' అని న్యాయ సహాయ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం రిజిజు ఇక్కడ విలేకరులతో అన్నారు. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సమాచార సాంకేతిక (మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) సవరణ నియమాలు, 2023ని గురువారం నోటిఫై చేసింది. 2023 సవరణలు కేంద్ర ప్రభుత్వం ఏదైనా వ్యాపారానికి సంబంధించి నకిలీ, తప్పుడు లేదా తప్పుదారి పట్టించే ఆన్‌లైన్ సమాచారాన్ని గుర్తించే కేంద్రం వాస్తవ తనిఖీ విభాగానికి తెలియజేయడానికి మంత్రిత్వ శాఖకు అధికారాన్ని అందజేస్తుంది. ఇదిలాఉండగా, ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కోవడానికి ప్రతిపక్ష శిబిరంలో ఐక్యం కావాలని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఇచ్చిన పిలుపుపై మాట్లాడుతూ ఇది అధికార పార్టీ బలాన్ని మాత్రమే చూపుతుందని కేంద్ర మంత్రి అన్నారు. బీజేపీ చాలా బలంగా ఉందని ఇది తెలియజేస్తోందని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే ప్రశ్నకు రిజిజు నేరుగా సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారు. ఎన్నికల సమయాలపై తాను ప్రకటన చేయలేనని చెప్పారు. 'నేను ఇక్కడ తేదీలను స్పష్టం చేయలేను. నేను న్యాయ, న్యాయ శాఖ మంత్రిని అయినందున నేను ఇక్కడ ప్రకటన చేయలేను. గడువులోగా ఎన్నికలను ప్రకటిస్తాం' అని తెలిపారు. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) అధినేత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ తన పాస్‌పోర్ట్‌కు సంబంధించి చేసిన ఆరోపణలపై అడిగిన ప్రశ్నకు, 'పాస్‌పోర్ట్‌ను హోం మంత్రిత్వ శాఖ జారీ చేస్తుంది' అని మంత్రి చెప్పారు.

కాజల్ హిందుస్తానీ అరెస్టు

మత విద్వేషాలు రెచ్చగొట్టిన నేరం కింద జ్యుడిషియల్ కస్టడీకి

గిర్ సోమనాథ్: గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలో రామనవమి సందర్భంగా విద్వేష ప్రగంగం చేసి, మత విద్వేషాలు రెచ్చ గొట్టిన నేరం కింద మతతత్వవాది కాజల్ హిందుస్తానీని పోలీసులు అరెస్టు చేశారు. హిందుస్తానీ ప్రసంగం వల్ల ఈనెల ఒకటో తేదీన ఉన్నావో పట్టణంలో మత ఘర్షణలు జరిగాయి. ఆదివారం ఉదయం హిందుస్తానీ పోలీసుల ఎదుట లొంగిపోగా ఆమెను కోర్టులో హాజరు పరిస్తే జ్యుడిషియల్ కస్టడీకి న్యాయస్థానం ఆదేశాలిచ్చిందని పోలీసు అధికారి తెలిపారు. హిందుస్తానీ తనను తాను ఓ ఎంట్రప్రెన్యూర్, రీసెర్చ్ ఎనలిస్ట్, సామాజిక కార్యకర్త, జాతీయవాదిగా ట్విట్టర్‌లో వర్ణించుకున్నారు. ఆమెకు ప్రధాని మోదీతో సహా 92వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. విశ్వహిందూ పరిషత్ కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజర వుతుంటారు. ఆమె మార్చి 30న విద్వేష ప్రసంగం చేయగా, రెండు రోజుల తర్వాత ఐపీసీ సెక్షన్ 295ఏ కింద ఎఫ్ఐఆర్ నమోదైంది. అల్లరిమూకపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేసి 80 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

పులులు పెరగడం గర్వకారణం: మోదీ

మైసూరు: జీవావరణం, ఆర్థిక వ్యవస్థ మధ్య వైరుధ్యాన్ని భారత్ పట్టించుకోదుగానీ ఈ రెండింటి సహజీవనానికి ప్రాధాన్యతిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. 'ప్రాజెక్ట్ టైగ్‌కు 50ఏళ్లు అయిన సందర్భంగా కర్ణాటక ఓపెన్ యూనివర్సిటీ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. వన్యప్రాణుల సంరక్షణ ప్రపంచ సమస్య అని చెప్పారు. అంతర్జాతీయ పెద్దపులల కూటమి (ఐబీసీఏ)ని ప్రారంభించారు. దేశంలో పులుల సంఖ్య గురించి వెల్లడించారు. 2022లో 3,167 పులులు ఉన్నట్లు చెప్పారు. పులుల సంఖ్య పెరుగుతోంది.. ఇది మనకు గర్వకారణమని అన్నారు. దేశంలో పులుల సంఖ్య పెరిగినందుకు అందరూ లేచి నిలబడి కరతాళ ధ్వనులతో అభినందనలు తెలపాలని సూచించారు. రాబోయే రోజుల్లో మన ఈ కుటుంబం మరింత పెద్దదవుతుందని ప్రపంచానికి హామీనిస్తున్నానన్నారు. 2006లో దేశంలో 1,411 పులులు ఉంటే 2010లో వాటి సంఖ్య 1,706కి చేరింది. 2014 నాటికి 2,226కి, 2018లో 2,967కి, 2022లో 3,167కి పెరిగింది. 'ప్రాజెక్ట్ టైగర్' విజయం భారత్‌కే కాదు యావత్ ప్రపంచానికి గర్వకారణమని మోదీ అన్నారు. భారత్ కేవలం పులులను సంరక్షించలేదు... అవి మరింతగా పెరిగేందుకు అనుకూలమైన జీవావరణాన్ని సృష్టించిందన్నారు. ప్రకృతికి సంరక్షించడం భారతీయ సంస్కృతిలో భాగంగా చెప్పారు. కొన్ని దశాబ్దాల కిందట భారత్‌లో చిరుతలు అంతరించి పోగా తాజాగా నమీబియా, దక్షిణాఫ్రికా నుంచి చిరుతలను దేశానికి తెచ్చినట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో ఉన్న

ఈ చిరుతులకు నాలుగు పిల్లలు జన్మించినట్లు చెప్పారు. ఆసియాలో అక్రమంగా సాగే వణ్యప్రాణుల వాణిజ్యం, అక్రమ వేట నిరోధించేందుకు ప్రపంచ నేతల కూటమి ఏర్పాటు కోసం 2019 జులైలో ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇదే క్రమంలో అంతర్జాతీయ పెద్ద పులల కూటమి (ఐబీసీఏ) ఆదివారం ఏర్పాటైంది. ప్రపంచంలోని ఏడు రకాల పెద్ద పులులు (పులులు, సింహాలు, చిరుతలు, జాగ్వార్, పూమా, లెపార్ట్, స్నో లెపార్ట్) సంరక్షణే ఐబీసీఏ లక్ష్యమని అధికారులు తెలిపారు. పులుల సంఖ్య పెరగడానికి వన్యప్రాణి సంరక్షణ కోసం అనేక గిరిజన తెగలు శ్రమించినట్లు మోదీ తెలిపారు. వారి తోడ్పాటును కొనియాడారు. కార్యక్రమంలో కేంద్రమంత్రులు భూపేంద్ర యాదవ్, అశ్విని కుమార్ చౌబే పాల్గొన్నారు.

అదానీ కంపెనీలపై విచారణ జరపాల్సిందే

- ఐక్య ప్రతిపక్ష భావనకు మా మద్దతు
- శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్

ముంబై: అదానీ గ్రూప్ కంపెనీలపై విచారణ అవసరమని 'ఐక్య ప్రతిపక్షం' భావిస్తున్నదని, అలాంటి డిమాండ్‌కు తమ పార్టీ మద్దతు ఇస్తోందని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ ఆదివారం తెలిపారు. విలేకరులతో మాట్లాడిన రౌత్, దర్యాప్తు తీరుపై కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మధ్య విభేదాలలో తాను జోక్యం చేసుకోకూడదని అన్నారు. 'అదానీ కంపెనీలపై విచారణ అవసరమని ఐక్య ప్రతిపక్షం భావిస్తోంది. శివసేన (యూబీటీ) దానిలో (ప్రతిపక్షం) భాగం' అని ఆయన అన్నారు. సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు, సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణ కలిసి చేయవచ్చని రాజ్యసభ సభ్యుడు చెప్పారు. పారిశ్రామికవేత్తలకు మద్దతివ్వాలి కానీ అవినీతికి మద్దతు ఇవ్వకూడదని రౌత్ అన్నారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ శుక్రవారం ఒక ఇంటర్వ్యూలో అదానీ గ్రూప్‌పై అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన వాటాల తారుమారు ఆరోపణల నేపథ్యంలో సుప్రీం కోర్టు నియమించిన విచారణ కమిటీ మరింత ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. జేపీసీలో అధికార పార్టీకి (బీజేపీ) మెజారిటీ ఉంటుందని, మహారాష్ట్రలో శివసేన (యూబీటీ), కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా ఉన్న పవార్ అన్నారు. రౌత్ మాట్లాడుతూ 'అదానీపై విచారణను పవార్ వ్యతిరేకించలేదు. ఇది జేపీసీ లేదా సుప్రీం కోర్టు పర్యవేక్షణలో విచారణ చేయాలా అనేది సమస్య' అని తెలిపారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై విరుచుకుపడిన రౌత్, ఉద్ధవ్ థాకరేపై తిరుగుబాటు చేసిన సీఎం, ఇతర శివసేన నాయకులు పృథ్వీరాజ్ చవాన్ (కాంగ్రెస్‌కు చెందిన) ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా అలా చేయాలని యోచించారని తెలిపారు. 'ఈ వ్యక్తులు ఢిల్లీలో (కాంగ్రెస్ నాయకుడు) అహ్మద్ పటేల్‌ను కలిశారు' అని అన్నారు. చవాన్ నవంబరు 2010-సెప్టెంబరు 2014 మధ్య మహారాష్ట్ర ముఖ్య మంత్రిగా పనిచేశారు. రౌత్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విపక్ష నేతలను లక్ష్యంగా చేస్తున్నప్పుడు శరద్ పవార్ ఒక వైఖరిని అవలంభించాలని అన్నారు. 'గౌతమ్ అదానీ... ప్రధాన మంత్రి మోదీకి అత్యంత సన్నిహితుడు అయినందున ఆయన సంపద పెరిగింది' అని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో సీఎం షిండే ప్రస్తుత పర్యటన గురించి అడిగిన ప్రశ్నకు, మహారాష్ట్ర ప్రభుత్వ నాయకులు 'మతపరమైన పర్యాటకం'లో ఉన్నారని తెలిపారు. గత 72 గంటల్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వడగళ్ల వాన, అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, బడ్జెట్ సమావేశాల తర్వాత రైతులకు ఉపశమనం కల్పిస్తామని ప్రభుత్వం చెప్పిందని సేన (యూబీటీ) నాయకుడు అన్నారు. 'అయోధ్యపై ఈ ప్రభుత్వం రాజకీయాలకు పాల్పడుతోంది. అసత్యానికి వ్యతిరేకుడైన రాముడు వారిని ఎన్నటికీ అనుగ్రహించడు. దేవుడు వారికి మంచి బుద్ధి ప్రసాదిస్తాడని నేను ఆశిస్తున్నాను' అని తెలిపారు.

ఎన్‌డీటీవీ బోర్డుకు

అదానీ గ్రూప్ కస్టోడియన్ అమన్ కుమార్ రాజీనామా

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్ కార్పొరేట్ బ్రాండ్ కస్టోడియన్, కార్పొరేట్ వ్యవహారాల అధిపతి అమన్ కుమార్ సింగ్ ఇతర ఆందోళనల కారణంగా ఎన్‌డీటీవీ లిమిటెడ్ బోర్డుకు రాజీనామా చేశారు. 'అమన్ కుమార్ సింగ్ కంపెనీ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. ఏప్రిల్ 1, 2023న పని గంటలు ముగియడంతో అమలులోకి వస్తుంది' అని స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో న్యూఢిల్లీ టెలివిజన్ లిమిటెడ్ గత వారం పేర్కొంది. మాజీ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ ఆఫీసర్ అయిన అమన్ కుమార్ సింగ్... ఛత్తీస్‌గఢ్‌లోని రమణ్ సింగ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంలో శక్తివంతమైన ప్రభుత్వాధికారిగా, ముఖ్యమంత్రికి ప్రధాన కార్యదర్శి. అయితే ఆయన తన సర్వీసుకు రాజీనామా చేసి, నవంబరు 2022లో అదానీ గ్రూప్‌లో కార్పొరేట్ బ్రాండ్ కస్టోడియన్, కార్పొరేట్ వ్యవహారాల అధిపతిగా చేరాడు. ఎన్‌డీటీవీని అదానీ నియంత్రణలోకి తీసుకున్నప్పుడు, న్యూస్ బ్రాడ్‌కాస్టర్ బోర్డులో అదానీ గ్రూప్ నియమించిన డైరెక్టర్లలో సింగ్ ఒకరు. కాగా, ఫిబ్రవరి 2020లో ఛత్తీస్‌గఢ్‌లోని ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) అక్రమ ఆస్తుల కేసులో సింగ్, ఆయన భార్య యాస్మీన్ సింగ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఇదిలాఉండగా, హైకోర్టు ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది. అయితే సుప్రీం కోర్టు గత నెలలో హైకోర్టు ఉత్తర్వును పక్కన పెట్టింది. సుప్రీం కోర్టు ఆదేశం తర్వాత, అమన్ సింగ్ మార్చి 6న ఈవోడబ్ల్యూ ముందు హాజరయ్యారు. ఒక వారం తర్వాత రాయ్‌పూర్‌లోని అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు అతని ముందస్తు బెయిల్ కోసం చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. ఎన్‌డీటీవీ బోర్డు నుంచి రాజీనామా చేసిన అదానీ గ్రూప్ రెండవ నామినీ సింగ్. మార్చి 9న ఎన్‌డీటీవీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో సునీల్ కుమార్ కంపెనీ అదనపు నాన్-ఎగ్జిక్యూటివ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొంది. 1979 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన కుమార్ 2012 నుంచి 2014 వరకు ఛత్తీస్‌గఢ్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

పాన్ మసాలా, పొగాకుపై

జీఎస్‌టీ సెస్ రేటు నిర్దేశించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ: ఫిబ్రవరిలో కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షతన, రాష్ట్రాల సహచరులతో కూడిన జీఎస్‌టీ మండలి పాన్ మసాలా, గుట్కా వ్యాపారాలలో పన్ను ఎగవేతలను పూడ్చడంపై రాష్ట్ర ఆర్థిక మంత్రుల కమిటీ నివేదికను ఆమోదించింది. పాన్ మసాలా, పొగాకు తయారీదారులపై ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చే రిటైల్ విక్రయ ధర ఆధారిత సెస్ రేటును ప్రభుత్వం పేర్కొంది. ఇది విలువ ఆధారిత ప్రాతిపదికన 28 శాతం వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) అంతకంటే ఎక్కువ సెస్ విధించిన మునుపటి పాలన నుంచి నిష్క్రమణ. మార్చి 31 నాటి ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ ప్రకారం, పాన్ మసాలాపై వర్తించే సెస్ రేటు పాన్ మసాలా పౌచ్ రిటైల్ విక్రయ ధర (ఆర్ఎస్‌పీ) కంటే 0.32 రెట్లు ఉంటుంది. పొగాకు గుట్కాతో కూడిన పాన్ మసాలా ఇప్పుడు ఆర్ఎస్‌పీ కంటే 0.61 రెట్లు సెస్ రేటును కలిగి ఉంది. అయితే పైపులు, సిగరెట్‌లకు స్మోకింగ్ మిశ్రమాల రేటు 0.69 రెట్లు. నమిలే పొగాకు, ఫిల్టర్ ఖైనీ, జర్దా సువాసనగల పొగాకు ఆర్ఎస్‌పీ కంటే 0.56 రెట్లు సెస్‌ని ఆకర్షిస్తాయి. బ్రాండ్ తయారు చేయని పొగాకు, హుక్కా లేదా గుడాకు ధర ఆర్ఎస్‌పీ కంటే 0.36 రెట్లు. కొత్త రేట్లు ఏప్రిల్ 1, 2023 నుంచి వర్తిస్తాయి. ఆర్ఎస్‌పీ ఆధారిత లెవీకి మారడం అంటే, తయారీదారులు ఇప్పుడు ఫ్యాక్టరీ గేట్ దాటిన సమయంలో మసాలా, నమిలే పొగాకు తుది రిటైల్ ధరపై సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఇది పన్ను ఎగవేతను అరికట్టడానికి సహాయపడుతుంది. ఎందుకంటే మొదటి పాయింట్‌లోనే సెస్ వసూలు అవుతుంది. ఏఎంఆర్‌జీ, అసోసియేట్స్ సీనియర్ పార్టనర్ రజత్ మోహన్ మాట్లాడుతూ ఆర్ఎస్‌పీ ఆధారిత వ్యవస్థకు వెళ్లడం వలన సరఫరా గొలుసులు విరిగిపోయినప్పుడు ప్రభుత్వానికి మరింత స్థిరమైన ఆదాయాన్ని అందించవచ్చని అన్నారు. 'కొత్త పన్ను పథకంలో మొత్తం సెస్ అమ్మకం మొదటి పాయింట్ వద్ద వసూలు చేస్తారు. అంటే తయారీదారు స్వయంగా, ఈ రంగంలో పన్ను ఎగవేత ప్రభావాన్ని పరిమితం చేస్తుంది' అని మోహన్ చెప్పారు.

పూనేలో ఐపీఎల్ బెట్టింగ్ ముఠా అరెస్టు

పూనే: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల క్రమంలో బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. దీంతో పూనే పోలీసులు నిఘా పెంచారు. తొమ్మిది మంది బెట్టింగ్ ముఠాను అరెస్టు చేశారు. ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ క్రమంలో ఐపీఎల్ బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం ఉండటంతో క్రైంబ్రాంచ్ శనివారం కోండ్వా ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా ముఠా పట్టుబడినట్లు ఓ అధికారి ఆదివారం తెలిపారు. ముఠా సభ్యుల నుంచి 18 మొబైల్ ఫోన్లు, మూడు లాప్‌టాప్‌లు, ఒక కంప్యూటర్, రూ.92 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఆర్ జీవితం అనుసరణీయం

వర్ధంతి కార్యక్రమంలో ముప్పాళ్ల

విశాలాంధ్ర - విజయవాడ: కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత అమరజీవి చండ్ర రాజేశ్వరరావు పోరాట స్ఫూర్తితో దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడాలని, ఆయన జీవితం అనుసరణీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. . కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు చండ్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి కార్యక్రమం పార్టీ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. విజయవాడ పోలీస్ కంట్రోల్ రూం వద్ద ఉన్న చండ్ర రాజేశ్వరరావు విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా చండ్ర రాజేశ్వరరావు విగ్రహానికి ముప్పాళ్ల నాగేశ్వర రావు, కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, అక్కినేని వనజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నీతి నిజాయితీకి మారుపేరు, పోరాటానికి ప్రతీక చండ్ర రాజేశ్వరరావు అన్నారు. ధనిక భూస్వామ్య కుటుం బంలో పుట్టి వైద్య విద్యను అర్ధంతరంగా వదిలి దాదాపు 400 ఎకరాల భూమిని కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజలకు అర్పించి తుది శ్వాసవిడిచే సమయానికి తన ఇంటిలో ఉన్న బట్టలు, లైబ్రరీలో ఉన్న పుస్తకాలు ఉంచుకుని నిరాడంబరంగా జీవించిన మహత్తర త్యాగశీలి సీఆర్ జీవితం ప్రతి కమ్యూనిస్టుకు అనుసరణీయం అన్నారు. ఆయన స్ఫూర్తితో పని చేస్తున్న కమ్యూనిస్టు నాయకులను ముప్పాళ్ల అభినందించారు. కుళ్లి కంపుకొడుతున్న అధికార వ్యవస్థ, రాజ్య పాలకుల నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణకు, పార్లమెంటరీ వ్యవస్థను, వాక్ స్వాతంత్ర్యపు హక్కులను కాపాడుకోవటం కోసం రానున్న రోజుల్లో సీపీఐని మరింత శక్తివంతమైన పార్టీగా మలిచేందుకు అందరూ కృషి చేయాలన్నారు.

జల్లి విల్సన్ మాట్లాడుతూ చండ్ర రాజేశ్వరరావు కమ్యునిస్టు పార్టీ అగ్రనేతలలో ప్రముఖులన్నారు. రైతు కుటుం బంలో జన్మించి పేద రైతుల విముక్తి కోసం రైతులను సమీకరించి పోరాటం సాగించిన మహానేత అన్నారు. భారత కమ్యునిస్టు పార్టీకి నాయకత్వం వహించి దేశంలో కమ్యూనిస్టు వృక్షాన్ని పెంచిన ఘనుడని కొనియాడారు. సుదీర్ఘ కాలంగా దేశమంతా నాయకత్వం వహించి మారు మూల ప్రాంతంలో నివసించే దళితులు, ఆదివాసీలు, గిరిజనులు మైనార్టీలకు అండగా వున్న మహోన్నత నాయకుడని తెలిపారు. విజయవాడ కేంద్రంగా జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం, ప్రజా సంఘాల నిర్మాణం కోసం ప్రముఖ పాత్ర వహించారన్నారు. దేశంలో భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్, ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం నిర్మించిన ఘనుడన్నారు. నేడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరంకుశ, నియంతృత్వ, మతోన్మాద, ప్రజాస్వామ్య వ్యతిరేక పోకడలు అనుసరిస్తున్న నరేంద్ర మోదీని తరిమి కొట్టేందుకు మనం నిర్మించుకున్న ప్రజా సంఘాలను కాపాడు కునేందుకు ఉభయ కమ్యూనిస్టుల అధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి 30వరకు ప్రచార కార్యక్రమంలో పాల్గొనడం కమ్యూనిస్టులుగా మనందరి కర్తవ్యమన్నారు. తొలుత ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి అర్ పిచ్చయ్య సీఆర్‌ని స్మరిస్తూ విప్లవగేయాలు ఆలపించారు. చివరిగా నగర సహాయ కార్యదర్శి లంకా దుర్గారావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు,తాడి పైడియ్య, మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులు కాలరాస్తున్న మోదీ, జగన్

ఏఐటీయూసీ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-లక్నో/అమరావతి: ప్రజాస్వామ్య హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఏఐటీయూసీ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశాల చివరి రోజైన ఆదివారం ప్రతినిధులనుద్దేశించి ఓబులేసు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థల్ని నిర్వీర్యం చేసి అన్ని వ్యవస్థలపైన బీజేపీ పెత్తనం చేస్తోందన్నారు. అవినీతిపరులను పెంచి పోషిస్తూ దేశ సంపదను కొల్లగొడుతున్న వారికి ఊడిగం చేస్తోందన్నారు. హిండెన్‌బర్గ్ నివేదికలో వెల్లడైన వాస్తవాలతో అదానీ ఆస్తులపై దేశవ్యాప్తంగా మేధావులు, ప్రజాస్వామ్యవాదులు గగ్గోలు పెడుతున్నా పార్లమెంటులో కనీసం ఒక్కరోజు కూడా దీనిపై చర్చించకపోవడం బాధాకరమని ఓబులేసు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ బాటలోనే సీఎం జగన్ నడుస్తున్నారని విమర్శించారు. ఇందుకు ఉదాహరణగా 1861 బ్రిటీష్ కాలంనాటి పోలీస్ చట్టాన్ని ఆసరా చేసుకుని జీవో నంబర్ ఒకటిని తేవడమేనన్నారు. తద్వార శాంతియుతంగా ఆందోళనలకూ అవకాశం లేకుండా ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధాలతో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల గొంతు నొక్కేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ థర్మల్ కేంద్రాలను అదానీ సంస్థలకు అప్పన్నంగా కట్టబెడుతున్నారని, ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు అన్న స్ఫూర్తితో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం చూస్తుంటే జగన్ ప్రభుత్వం అడ్డుకోకపోగా, అండగా నిలవడం దుర్మార్గమన్నారు.పోరాడి సాధించుకునే 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడలుగా మార్చడం, నల్ల సాగు చట్టాలను తేవడాన్ని గుర్తుచేశారు. ఇటువంటి ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను విడనాడాలని పాలకులకు హితవు పలికారు. రాష్ట్రంలో సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎంఎల్ సమస్యలపై, స్కీం కార్మికులైన ఆశా-అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం వర్కర్లు, స్కూల్ ఆయాల సమస్యలపై, భవన ముఠా కార్మికులు, ఆటో రంగం కార్మిక సమస్యలపై ఉద్యమించామని గుర్తుచేశారు. వారి న్యాయమైన డిమాండ్లను జగన్ ప్రభుత్వం పరిష్కరించాలని ఓబులేసు డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలని, కార్మికులందరికీ సామాజిక -సాంఘిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం ఉద్యమ కార్యాచరణ రూపొందుతోందని తెలిపారు. ఈనెల 14 నుంచి మే 15వ తేదీ వరకు జరుగనున్న ప్రచారాందోళనలో ఏఐటీయూసీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జనార్ధనరావుకు అశ్రు నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: ఉపాధ్యాయ సంఘ నాయకుడు పోతినేని జనార్ధనరావు మరణం ప్రగతిశీల ఉద్యమాలకు, ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని అనేక మంది తెలిపారు. అనారోగ్యంతో మరణించిన జనార్ధనరావు అంతిమ యాత్ర, అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ఆయన మృతి తెలుసుకున్న అనేక రాజకీయ పార్టీల నాయకులు, ఉపాధ్యాయ, క్రీడారంగానికి చెందిన ప్రముఖులు స్థానిక ప్రజాశక్తి నగర్‌లోని స్వగృహం వద్ద ఉంచిన జనార్ధనరావు భౌతిక దేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు, సీపీఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు జనార్ధనరావు భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి, పూలదండలతో నివాళులు అర్పించారు. ఎస్టీయూ నాయకులు ఇమ్మాన్యుయెల్, కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు వై.చెంచయ్య, ఆర్.పిచ్చయ్య, వెలగపూడి ఆజాద్, మోతుకూరి వెంకటేశ్వరరావు, పొట్లూరి రాఘవేంద్ర రావు, అరుణకుమార్, పోతురాజు నాగేశ్వరరావు, సి.నరసింప ారావు, పి.భాను, వైసీపీ నాయకులు దేవినేని అవినాష్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, క్రీడా రంగానికి చెందిన ప్రముఖులు తదితరులు నివాళులు అర్పించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు జనార్ధనరావు అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల సంతాపం

జనార్ధనరావు మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాలు సంతాపం తెలిపాయి. ఉపాధ్యాయ సంఘం పట్ల మమకారం, పార్టీపై అచంచల విశ్వాసం జనార్ధనరావు గారి సొంతమని, సంఘ విధానాలకు వ్యతిరేకంగా పని చేసే వారి యెడల ముక్కోపిగా ఆయన ప్రసిద్ధుడని పేర్కొన్నాయి. ఆయన శిష్య బృందం అనేక మంది సంఘంలో ఉన్నత పదవులు అలంకరించారని ఉపాధ్యాయ రంగానికి చెందిన నాయకులు తాడి శకుంతల, మూకల అప్పారావు, బెజవాడ రాజారావు, నడిపినేని వెంకట్రావు కొనియాడారు. మరణాంతరం నేత్ర దానం చేసిన మహనీయులని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సంఘంలో జనార్ధనరావుది చెరగని ముద్ర

జనార్ధనరావు కృష్ణా జిల్లా పునాదిపాడులో రైతు కుటుంబంలో జన్మించారు. బీఎస్సీ, బీఈడీ చదివి ముదినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయునిగా 1952లో ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించారు. అనేక మంది పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దారు. మొదటి నుంచి వామపక్ష భావజాలానికి ఆకర్షితుడై కమ్యూనిస్టు పార్టీ బాల సంఘాల్లో, విద్యార్థి సంఘాలలో చురుకుగా పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన నాటి నుంచి ఉపాధ్యాయ ఉద్యమ నాల్గవ స్తంభం అయిన మాజీ ఎమ్మెల్సీ పెర్నా శ్రీరామమూర్తి నాయకత్వంలోని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ యూనియన్ (ఏపీటీయూ) లో చురుకైన కార్యకర్తగా పని చేశారు. ఉన్నత ఆశయాలతో పని చేశారు. కాగా శ్రీరామమూర్తి శాసనమండలి ఎన్నికల్లో వరుసగా 5 సార్లు పోటీ చేశారు. ఆనాడు జరిగిన అన్ని పోరాటాలలో శ్రీరామమూర్తితో జనార్ధనరావు పాత్ర విడదీయరానిది. నాడు జరిగిన అన్ని కృష్ణా శాసన మండలి ఎన్నికలలో ప్రధాన ఎన్నికల ఏజెంట్‌గా జనార్ధనరావు పని చేశారు. నిలబడే అవకాశం వచ్చినా పెర్నానే మా నాయకుడు అని సున్నితంగా తిరస్కరించారు. నాటి జిల్లా పరిషత్ చైర్మన్ ప్రోద్భలంతో నిలిపిన అభ్యర్థికి ఎదురు నిలవడమే కాకుండా కమ్యూనిస్టు పార్టీని సమర్థిస్తున్నందున చాలా ఊర్లకు బదిలీ కావలసి వచ్చింది. ప్రధానోపాధ్యాయునిగా మోగులూరు స్కూల్‌కు బదిలీ చేసినా అక్కడే ఉండి క్రమ శిక్షణతో విద్యను అందించారు. జనార్ధనరావు విస్సన్నపేట స్కూల్‌లో పని చేస్తున్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు హయాంలో పదవీ విరమణ వయస్సు 55కు తగ్గించారు. దీంతో జనార్ధనరావు బృందం న్యాయస్థానం మెట్లు ఎక్కి మరల 58కి పదవీ విరమణ సాధించి విసన్నపేటలోనే పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ చేశాక సుదీర్ఘ కాలంపాటు ఉపాధ్యాయ సంఘానికి పూర్తి సమయం కేటాయించారు. సంఘం నిర్వహిస్తున్న పత్రిక ఉపాధ్యాయవాణికి ప్రధాన సంపాదకునిగా పత్రికకు దిశ దశ నిర్దేశం చేశారు. ఏపీటీయూ అమరులు వీణా విజయరామరాజు నాయకత్వంలోని రిజిస్టర్ ఫెడరేషన్‌లో విలీనం అయి ఏపీ ఎస్‌టీఎఫ్‌గా ఏర్పడటంలోనూ అవి మరల తెలంగాణ ఎస్‌టీయూలో విలీనంలోనూ క్రియాశీలక పాత్ర పోషించారు. విజయవాడ నగరం, ఉమ్మడి కృష్ణా జిల్లా సంఘ నిర్మాణంలో తన 85వ యేట వరకు పని చేశారు. ఉపాధ్యాయ సంఘం కోసం విజయవాడ గాంధీనగర్‌లో భవనం కొనుగోలు, దాని పునర్ నిర్మాణంలోనూ చురుకైన పాత్ర పోషించారు. 95 యేట వృద్ధాప్యంతో మరణించిన జనార్ధనరావు... చివరి వరకు విశాలాంధ్ర, ఉపాధ్యాయ వాణి పాఠకునిగా ఉన్నారు. జనార్ధనరావు కుమార్తె డాక్టర్ శైలజా రాణి విజయవాడ నగరంలో ప్రముఖ తల్లీపిల్లల వైద్యునిగా పేద వర్గాలకు వైద్య సేవలు అందిస్తున్నారు. మరొక కుమార్తె పద్మజబాల కబడ్డీ అంతర్జాతీయ కోచ్‌గా సేవలు అందిస్తున్నారు.

హైదరాబాద్ పర్యటన సందర్భంగా సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డిని కలిసి రాజకీయాలను చర్చిస్తున్న సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా. పక్కన బి.వి. విజయలక్ష్మి, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, చెన్నకేశవరావు.

తగ్గిన బంగారం దిగుమతులు

న్యూఢిల్లీ: బంగారం దిగుమతులు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్- ఫిబ్రవరి మధ్య 30 శాతం తగ్గి 31.8 బిలియన్ డాలర్లకు చేరాయి. అధిక కస్టమ్స్ సుంకం, ప్రపంచవ్యాప్తంగా అస్థిర ఆర్థిక పరిస్థితులే దీనికి కారణమని కేంద్ర వాణిజ్య శాఖ తన నివేదికలో పేర్కొంది. 2021-22 ఇదే సమయంలో స్వర్ణం దిగుమతులు 45.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. 2022 ఏప్రిల్ నుంచి దిగమతులు తగ్గుతూ వస్తున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్- ఫిబ్రవరి మధ్య వెండి దిగుమతులు 66 శాతం పెరిగి 5.3 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి దిగుమతులు గణనీయంగా తగ్గినప్పటికీ వాణిజ్యలోటు మాత్రం ఆ స్థాయిలో తగ్గకపోవడం గమనార్హం. 2022-23 ఏప్రిల్- ఫిబ్రవరి మధ్య సరకుల వాణిజ్య లోటు 247.52 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. అంత క్రితం ఏడాది ఇదే సమయంలో ఇది 172.53 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకునే దేశం భారత్. ముఖ్యంగా ఆభరణాల పరిశ్రమలో ఉండే డిమాండ్ వల్లే భారీ ఎత్తున బంగారం దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఏడాదికి సగటున భారత్ 800- 900 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంటోంది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎస్కేయూకు కాంస్య పతకం

విశాలాంధ్ర-రాప్తాడు: చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో ఏప్రిల్ 5 నుంచి ఏప్రిల్ 9 వరకు జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలలో ఎస్కేయూ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టు ఆంధ్ర యూనివర్సిటీ జట్టుపై 06-01 తేడాతో విజయం సాధించి కాంస్య పతకంతో తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఎస్కేయూ ఏర్పడిన 42 ఏళ్ల చరిత్రలో ఆల్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్లలో మొట్టమొదటిసారిగా సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టు పతకం సాధించిందని, ఇది యూనివర్సిటీకి గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఎస్కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ ఎంవీ శ్రీనివాసన్, టీం మేనేజర్ జి.నరేష్, ఫిజికల్ డైరెక్టర్ కోచ్ సి.వెంకటేశులు జట్టు సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. 42 ఏళ్ల యూనివర్సిటీ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఆల్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్లో జాతీయస్థాయిలో ఎస్కే యూనివర్సిటీ పేరును మారుమోగేలా చేసి పతకం సాధించడానికి కృషి చేసిన ఎం.వి శ్రీనివాసన్ సాఫ్ట్‌బాల్ పురుషుల జట్టుకు కోచ్‌గా, క్రీడాకారులందర్నీ చక్కటి సమన్వయంతో విజయతీరాలకు నడిపించిన ఎస్కేయూ పీడీ వెంకటేశులును ప్రత్యేకంగా అభినందించారు. టీమ్ మేనేజర్ నరేష్, సీనియర్ క్రీడాకారుడు బద్రీలను వీసీతోపాటు రెక్టార్ మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి ఎస్కేయూకు మంచి పేరు తీసుకురావాలని వీసీ ఆకాంక్షించారు.

విమర్శలను పట్టించుకోను:శృతి

హైదరాబాద్: తెలుగులో అగ్ర కథానాయకులు చిరంజీవి, బాలకృష్ణతో జోడీ కట్టడంపై వస్తోన్న విమర్శలపై నటి శ్రుతిహాసన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. వాటిని తాను ఏమాత్రం పట్టించుకోనని తెలిపారు. బాలీవుడ్‌లో ఇప్పటికీ ఈ ట్రెండ్ కొనసాగుతోందని అన్నారు. 'వయసు వ్యత్యాసాన్ని ఉద్దేశిస్తూ కొంతమంది చేసే వ్యాఖ్యలు నన్ను ఏ మాత్రం ఇబ్బంది పెట్టలేదు. ఎందుకంటే చాలా మంది ప్రేక్షకులు ముఖ్యంగా ఆయా హీరోల అభిమా నులు ఆ సినిమాలను మెచ్చుకున్నారు. వాళ్ల విమర్శలను నేను ప్రశంసగానే భావిస్తా. నటుడికి ఈ వయసు. నటికి ఈ వయసు. ఆ హీరోల పక్కన ఆమె సరిగ్గా సరిపోయిందని ఇప్పటివరకూ ఎవరూ అనలేదు. అందరూ నన్నింకా చిన్న పిల్లగానే చూస్తున్నారు దానికి నేను ఆనందిస్తున్నా. జోక్స్ అన్నింటినీ పక్కన పెడితే... ఆ పాత్ర చిత్రీకరణ నాకెంతో నచ్చింది. అలాగే, ఇద్దరు లెజండరీ నటులతో నటించే అవకాశం వచ్చింది. అలాంటప్పుడు నేనెందు ఆ సినిమాలకు నో చెప్పాలి. మరో విషయం ఏమిటంటే... ఈ విమర్శలు నాకు వ్యక్తిగతంగా ఎదురైనవి కాదు. నా రోల్‌ను అలా రాసినందుకు? డైరెక్టర్ మమ్మల్ని ఎంచుకున్న విధానంపైనే విమర్శలు వస్తున్నాయి. కాబట్టి, వ్యక్తిగతంగా వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. మనం తరచూ మాట్లాడుకునే బాలీవుడ్‌లోనూ వయసు వ్యత్యాసం ఉంటుంది' అని శ్రుతిహాసన్ వివరించారు. మ్యూజిక్ బ్యాండ్‌ను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో డబ్బు సంపాదించడం కోసం తాను సినిమాల్లోకి వచ్చానని, నటిగా తాను చేసిన తొలి సినిమా విజయవంతం కాలేదని తెలిపారు. ఆ సినిమా విడుదలైనప్పుడు... నటిగా తాను 80 శాతం కూడా న్యాయం చేయలేకపోయానని, అందుకు తనకెంతో బాధగా అనిపించిందన్నారు.

శరవేగంగా 'తంగలన్' షూటింగ్

చెన్నై: రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా నటిస్తున్న తంగలన్ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం పోస్టర్, టీజర్... సినిమాపై ఎక్కడలేని అంచనాలు సృష్టించాయి. ఈ సినిమా 19 శతాబ్దంలోని కోలార్ గోల్డ్ ఫీల్స్ నేపథ్యంలో తెరకెక్కనుంది. తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో షూటింగ్ జరిపి... మిగిలిన భాషల్లో ఈ సినిమాను డబ్బింగ్ చేసే ఆలోచనలో మేకర్స్ ఉన్నారట. అంతేకాకుండా ఈ చిత్రాన్ని 3డీలో రూపొందిస్తున్నారని సమాచారం. ఇదిలా ఉంటే ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్తను చిత్రబృందం తాజాగా వెల్లడించింది. విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 17న ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు. ఈ సినిమాలో విక్రమ్‌కు జోడీగా మాళవిక మోహనన్, పార్వతి తిరువోతు నటిస్తున్నారు.

అలా అయితే ఐపీఎల్‌లో ఆడొద్దు!

వార్నర్‌పై సెహ్వాగ్ తీవ్ర విమర్శలు





న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో దిల్లీ క్యాపిటల్స్‌కి ఒక్క విజయం కూడా దక్కలేదు. ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచుల్లో ఓటమి పాలైంది. దీంతో ఆ జట్టు డేవిడ్ వార్నర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెగ్యులర్ కెప్టెన్ రిషభ్ పంత్ రోడ్డు ప్రమాదానికి గురై ఈ సీజన్‌కు దూరం కావడంతో వార్నర్‌కు జట్టు పగ్గాలను మేనేజ్‌మెంట్ అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా రాజస్థాన్ చేతిలోనూ 57 పరుగుల తేడాతో దిల్లీ ఓటమిపాలైంది. వార్నర్ రాజస్థాన్ మీద 55 బంతుల్లో 65 పరుగులు చేశాడు. ఈ క్రమంలో డేవిడ్ వార్నర్ ఆటతీరు, నాయకత్వంపై టీమిండియా మాజీ ఆటగాడు వీరేంద్ర సెహ్వాగ్ తీవ్ర విమర్శలు గుప్పించాడు. వేగంగా పరుగులు చేయకపోతే మాత్రం ఐపీఎల్‌లో ఆడొద్దని హితవు పలికాడు. 'డేవిడ్ వార్నర్‌కు చెప్పాల్సిన సమయం ఇదేనని నేను భావిస్తున్నా. అతడికి బాధ కలిగినా సరే... ఇంగ్లిష్‌లో చెప్పాలి... డేవిడ్, ఉత్తమ ఆటతీరును ప్రదర్శించు. 25 బంతుల్లో 50 పరుగులు చేయాలి కానీ... మరీ నిదానంగా ఆడొద్దు. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను చూసి నేర్చుకో... అతడు కేవలం పాతిక బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసేశాడు... అలా ఆడలేకపోతే మాత్రం... వార్నర్ నువ్వు ఇక్కడికి రావొద్దు... ఐపీఎల్‌లో ఆడొద్దని చెబుతా... డేవిడ్ వార్నర్... 55 బంతుల్లో 65 పరుగులు చేసే కన్నా 30ల్లోనే ఔటైపోతే జట్టుకు ప్రయోజనం కలుగుతుంది... వెనుక ఉన్న రోవ్‌మన్ పావెల్, ఇషాన్ పోరెల్ కాస్త ముందొచ్చి ఆడేందుకు అవకాశం ఉంటుంది... అప్పుడు ఫలితం మారే ఛాన్సూ ఉంది... భారీ హిట్టింగ్ చేయగల అలాంటి బ్యాటర్లకు తగినన్ని బంతులు వదిలేస్తే గెలిపించగలరు" అని సెహ్వాగ్ వ్యాఖ్యానించాడు.

బంతుల్ని వృథా చేయడం సరైంది కాదు: రోహన్ గవాస్కర్

ఐపీఎల్‌లో దాదాపు ఆరువేలకుపైగా పరుగులు చేసిన అనుభవం ఉన్న డేవిడ్ వార్నర్ నిదానంగా ఆడటాన్ని భారత మాజీ ఆటగాడు రోహన్ గవాస్కర్ కూడా తప్పుబట్టాడు. 'ఒకవేళ ఎనిమిది బంతుల్లో ఎనిమిది పరుగులు చేసి ఔటైతే... సరైన రిథమ్‌లో లేడులే అని పట్టించుకోరు. కానీ, కెప్టెన్ అయి ఉండి, అనుభవం కలిగిన బ్యాటర్ ఎక్కువ బంతులను వృథా చేయడం సరైంది కాదు. ఇలాంటి ఇన్నింగ్స్‌లు ఆడతావని నువ్వు (వార్నర్) కూడా అనుకోని ఉండవు. ఒకవేళ దిల్లీకి వార్నర్ కెప్టెన్ కానట్లయితే రిటైర్‌హర్ట్‌గా మేనేజ్‌మెంట్ వెనక్కి పిలిచేది. భారత యువ బ్యాటర్ ఇలాంటి ప్రదర్శన చేస్తే... అదే అతడి చివరి మ్యాచ్ అయ్యేది... దిల్లీ ఓటమికి పూర్తి బాధ్యత డేవిడ్ వార్నర్ తీసుకోవాల్సిందే' అని విమర్శించాడు.



రింకూసింగ్ స్వైర విహారం

ఆఖరి ఓవర్‌లో ఐదు సిక్స్‌లు

ఉత్కంఠ పోరులో గుజరాత్‌పై కోల్‌కతా విజయం

అహ్మదాబాద్: ఐపీఎల్ 16వ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ సంచలన విజయం నమోదు చేసింది. రింకూ సింగ్(48) ఒంటి చేత్తో మ్యాచ్ గెలిపించాడు. అతను సిక్సర్ల మోత మోగించడంతో కోల్‌కతా 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. యశ్ దయాల్ వేసిన 20వ ఓవర్‌లో కోల్‌కతా విజయానికి 29 రన్స్ కావాలి. రింకూ వరుసగా ఐదు బంతుల్లో ఐదు సిక్స్‌లు కొట్టాడు. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. కోల్‌కతా బ్యాటర్ రింకూ సింగ్ (48- 21 బంతుల్లో 1 ఫోర్, 6 సిక్స్‌లు) చివర్లో విరుచుకుపడి గుజరాత్ గెలుపు ఆశలపై నీళ్లు చల్లాడు. వెంకటేశ్ అయ్యర్ (83బీ 40 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) భారీ ఇన్నింగ్స్ ఆడాడు. నితీశ్ రాణా (45బీ 29 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా రాణించాడు. అల్జారీ జోసెఫ్ వేసిన 16 ఓవర్‌లో వెంకటేశ్ అయ్యర్ ఔటవ్వడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. ఈ ఓవర్‌లో నాలుగో బంతికి వెంకటేశ్ అయ్యర్ గిల్‌కు చిక్కాడు.

రషీద్‌ఖాన్ హ్యాట్రిక్: రషీద్ ఖాన్ 17వ ఓవర్‌లో వరుస మూడు బంతుల్లో మూడు వికెట్లు హ్యాట్రిక్ సాధించాడు. ఈ సీజన్‌లో తొలి హ్యాట్రిక్ తీసిన బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. రషీద్ ఖాన్ వేసిన 17 ఓవర్లో తొలి బంతికి రస్సెల్ (1) వికెట్ కీపర్ భరత్‌కు చిక్కాడు. రెండో బంతికి సునీల్ నరైన్ (0) జయంత్ యాదవ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. మూడో బంతికి శార్దూల్ ఠాకూర్ (0) వికెట్ల ముందు దొరికిపోయాడు. కోల్‌కతా విజయానికి చివరి ఓవర్‌లో 29 పరుగులు అవసరం కాగా.. రింకూ సింగ్ వరుసగా ఐదు సిక్స్‌లు బాదడంతో కోల్‌కతా విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్... 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 204 పరుగులు చేసింది. చివర్లో విజయ్ శంకర్ (63లిబీ 24 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) దంచికొట్టాడు. శంకర్ 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖరి ఓవర్‌లో వరుసగా మూడు సిక్సర్లు బాదాడు. చివరి రెండు ఓవర్లలో 45 పరుగులు రాగా.. ఇందులో శంకర్ చేసినవి 41. సాయి సుదర్శన్ (53బీ 38 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (39బీ 31 బంతుల్లో 5 ఫోర్లు) కూడా రాణించారు. వృద్ధిమాన్ సాహా (17), అభినవ్ మనోహర్ (14) పరుగులు చేశారు. కోల్‌కతా బౌలర్లలో సునీల్ నరైన్ (3/33) ఆకట్టుకోగా.. సుయాశ్ శర్మ ఒక వికెట్ పడగొట్టాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.